**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 59, పేజీలు - 08

మంగళవారం, ఆగస్టు 25, 2026 వెల: 5 రూ/.






## అమెరికా పర్యటనను అడ్డుకున్నారు,

# కానీ నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు

### సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- ఇది రేవంత్ రెడ్డికి కాదు, తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం
- తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై కేంద్రంపై మండిపాటు
- కేంద్రం తనను అడ్డుకున్నా, తన లక్ష్యాన్ని అడ్డుకోలేరని వ్యాఖ్య
- మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని సీఎం ఆగ్రహం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర విదేశాంగ శాఖ పొలిటికల్ క్లియరెన్స్ఇవ్వకపోవడంతో తెలంగాణలో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బ్రిటన్, అమెరికా పర్యటనల కోసం విదేశాలకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అమెరికా టూర్ రద్దు కావడంతో బ్రిటన్‌లో పర్యటించి అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్ వచ్చారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై ఇప్పటికే కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, బీజేపీ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటనను అడ్డుకోవడం అంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమేనని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అభివృద్ధి, పెట్టుబడుల కోసం వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడం అంటే ఇది స్పష్టంగా తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష అని అర్థమవుతోందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లోక్‌సభ, రాజ్యసభల్లో

2లో..

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ..

# ప్రపంచ మార్కెట్లే లక్ష్యం

- దేశీయ పాప్‌కార్న్ విత్తనాలను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి, సీఎం
- ఫుడ్ ప్రాసెసింగ్‌తో వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు
- ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీలను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చేందుకు భారీ ప్రణాళిక



అమరావతి (ప్రశ్న న్యూస్) వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియతో ఉత్పత్తుల విలువ పెరిగి, రైతులకు ప్రయోజనం కలగడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టి జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఏలూరు జిల్లా ముసునూరు వద్ద ఏర్పాటు చేసిన 'గార్మే పాప్ కార్నికా' నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దేశంలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. "రైతులపై ఉన్న ప్రేమతో ఉపరాష్ట్రపతి ఏలూరు జిల్లాకు వచ్చి జన్యుమార్పిడి చేయని మొక్కజొన్న విత్తనాలను ఆవిష్కరించారు. గార్మే పాప్ కార్న్ సంస్థ మన దేశీయ నేలపైనే రైతులతో కలిసి నాన్-జీఎంఓ విత్తనాలను ఉత్పత్తి చేయడం అభినందనీయం. నూజివీడు గడ్డపై పండిన ఈ పాప్‌కార్న్ దేశవిదేశాలకు ఎగుమతి కావడం గర్వకారణం" అని అన్నారు.

2లో..

## అక్రమ నిర్మాణాల కట్టడిలో

# ముగ్గురు కమిషర్లు విఫలం!

- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ.. చర్యలు మాత్రం శూన్యం
- జోనల్ కమిషనర్ల మౌనమే అక్రమ నిర్మాణాలకు అండగా మారిందా.?
- అధికారుల నిర్లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు
- అంజయ్య నగర్ సంఘటనతో ఇకనైనా కమిషనర్లు కఠిన చర్యలు తీసుకునేనా.?
- కార్మికుల ప్రాణాలు పోతున్న, ప్రభుత్వ ఆదాయం భారీగా గండి కొడుతున్న అధికారులలో చలనం లేకపాయే.?










**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు రోజురోజుకూ పెరుగుతున్నా వాటిని కట్టడి చేయాల్సిన ఉన్నత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజావాణిలో ప్రజలు ఎన్నో ఫిర్యాదులు చేస్తున్నా వాటిపై కఠిన చర్యలు ఎక్కడ కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ముగ్గురు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, జోనల్ సీపీ స్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా ఫలితం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

### సాధారణ, ప్రజావాణి ఫిర్యాదులు బుట్టదాఖలా.?

ప్రజావాణిలో అక్రమ నిర్మాణాలపై ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.? వాటిలో ఎన్ని పరిశీలించారు.? ఎన్ని నిర్మాణాలపై నోటీసులు ఇచ్చారు.? నోటీసులు ఇచ్చిన తర్వాత నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయి.? సీజ్ చేసిన భవనాలు ఎన్ని.? సీజ్ చేసిన తర్వాత ఎన్ని నిర్మాణం పూర్తి చేసుకొని వినియోగంలో ఉన్నాయి.? ఎన్ని కూల్చివేశారు.? ఎన్ని కేసులు నమోదు చేశారు.? ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉన్నాయి.? అనే వివరాలను కమిషనర్లు బహిర్గతం చేయగలరా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వాటిని బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. ఒక్క ఫిర్యాదుపై అయిన పూర్తి స్థాయిలో చర్య తీసుకున్నారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఉన్నత అధికారుల మౌనం ఎందుకు.?

చైన్‌మెన్ నుంచి న్యాక్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్, ఏసీపీ, డిప్యూటీ కమిషనర్, జోనల్ ఏసీపీ, జోనల్ కమిషనర్ స్థాయి వరకు పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు ఎలా పుట్టుకొస్తున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొందరు అధికారులు లంచాల తీసుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనేది బహిరంగ రహస్యమే. సిబ్బంది, అధికారులు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయించి వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందన ఏది.?

అక్రమ నిర్మాణాలపై పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమైనా ముగ్గురు కమిషనర్లు, సంబంధిత జోనల్ కమిషనర్లు, జోనల్ సీపీలు, డిప్యూటీ కమిషనర్లు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు, జర్నలిస్టులు అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారినే ఇబ్బందులకు గురి చేయడం, అక్రమ నిర్మాణదారులతో చెప్పి తప్పుడు కేసులు పెట్టడం వంటి అనేక ఆరోపణలు కూడా అధికారులపై వినిపిస్తున్నాయి. అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే వారిని కాకుండా అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### సంఘటన జరిగినప్పుడే హడావుడినా.?

ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, కోర్టు ఆదేశాలు వచ్చినప్పుడు లేదా ముఖ్యమంత్రి సీరియస్ అయినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా ప్రకటనలు చేయడం, తనిఖీలు నిర్వహించడం, పేరుకు నాలుగైదు అక్రమ నిర్మాణాలు కూల్చివేయడం అంతే, తరువాత వారం రోజులకే పరిస్థితి మళ్లీ యథాతథంగా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత కమిషనర్లు స్పందించడం కాదు. ప్రమాదాలకు కారణమయ్యే అక్రమ నిర్మాణాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

### విజిలెన్స్ నివేదికలపై చర్యలేవి.?

అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికలు ఏమయ్యాయి.? వాటిపై తీసుకున్న చర్యలేంటి.? బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారా.? అన్నది కూడా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. అవినీతి అధికారులపై నివేదికలు తయారవుతున్నా చర్యలు లేకపోతే అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయన్న అనుమానాలకు బలం చేకూరుతుంది. జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం ఉండి కూడా ఇంత అవినీతి జరుగుతుంది అంటే మరి విజిలెన్స్ విభాగం ఉండి ఏం ఉపయోగమో ప్రభుత్వానికే తెలియాలి.

### కోర్టు-స్టే లపై ఎందుకీ నిర్లక్ష్యం.?

కోర్టు కేసులు, స్టే ఆర్డర్లు ఉన్న నిర్మాణాల విషయంలో డిప్యూటీ, జోనల్ కమిషనర్లు, ఇతర సంబంధిత అధికారులు నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నారా.? స్టే తొలగింపునకు కౌంటర్లు వేస్తున్నారా.? వేయకుంటే ఎందుకు వేయడం లేదు.? లేక వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగుతున్నా మౌనం వహిస్తున్నారా.? అన్నది తేలాల్సి ఉంది. గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు కమిషనర్ కార్యాలయాల పరిధిలో అధికారులు ప్రజల కోసం విధులు నిర్వహిస్తున్నారా.? లేక అక్రమాలకు అండగా నిలుస్తున్నారా.? అన్నది కమిషనర్లే తేల్చాలి. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా సమీక్షించి, పెండింగ్ ఫిర్యాదులపై గడువుతో కూడిన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఉన్నత అధికారులు మౌనం వహిస్తే, ఆ మౌనం వెనుక కారణమేంటో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది.

## 22ఏ నిషేధిత భూముల అంశంలో

# భయపడాల్సిన అవసరం లేదు

### - మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. 22ఏ భూములకు సంబంధించి నిజమైన సమస్యలు ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి 22ఏ భూముల అంశంపై పలు కీలక విషయాలను వెల్లడించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములు, వివిధ ప్రభుత్వ ఉత్తర్వులు, రిలాక్సేషన్ ఇచ్చిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రిలాక్సేషన్ వచ్చిన కేసులను క్లియర్ చేశామని రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిలో నిజమైన సమస్యలను పరిశీలించి 24 గంటల్లో పరిష్కారం చేస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఒకట్రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నా వాటినీ పరిశీలించి పరిష్కరిస్తామని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. 22ఏ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఈనెల 18వ తేదీ నుంచి ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చినట్లు పొంగులేటి తెలిపారు.

2లో..

## టెక్నాలజీతో ప్రభుత్వ సేవలు

# మరింత సులభతరం

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు డేటా ఇంటిగ్రేషన్ విధానం
- ఎల్‌నినో ప్రభావం.. పంటల దిగుబడిపై సమీక్ష
- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా, వేగంగా అందాలని, ఇందుకోసం ఏఐ అసిస్టెంట్, బ్లాక్ చెయిన్ వంటి అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేని విధంగా పాలన ఉండాలని స్పష్టం చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం పదేపదే వాటిని అప్‌లోడ్ చేసే పనిలేకుండా 'డేటా ఇంటిగ్రేషన్' విధానాన్ని అమలు చేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో ఆర్టీజీఎస్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖలు తమ సమర్థతను పెంచుకుని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితిని అధికారులు సీఎంకు వివరించారు. ఈసారి పంటల దిగుబడి సాధారణం కన్నా

2లో..

# ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ.. ప్రపంచ మార్కెట్లే లక్ష్యం

17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, దేశీయ పాప్‌కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉండటంపై గార్మె సంస్థను ఆయన ప్రశంసించారు. ఇప్పటివరకు పాప్‌కార్న్ కోసం బ్రెజిల్ వంటి దేశాలపై ఆధారపడ్డామని, ఇకపై ఆ సంపద మన దేశంలోనే ఉంటుందని తెలిపారు.

### గ్లోబల్ బ్రాండ్లుగా మన ఉత్పత్తులు

"ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో వంటివి ప్రపంచ ప్రసిద్ధి చెందిన బ్రాండ్లుగా మారాలి. రైల్వే స్టేషన్లలోనూ వీటి కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. కొండపల్లి కొయ్యబొమ్మల వంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరాలి. కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతులను పారిశ్రామికవేత్తలుగా చూస్తున్నాయి. పసుపు, మిరప, ఆక్వా ఉత్పత్తులకు విలువ జోడించి ఎగుమతి చేయడమే మా లక్ష్యం" అని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 10 శాతం ఉత్పత్తులు మాత్రమే ప్రాసెస్ అవుతున్నాయని, ఈ శాతాన్ని పెంచడం ద్వారా అధిక సంపదను ఆర్జించవచ్చని అన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని, ముఖ్యంగా యువత ఈ రంగంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

### రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జల భద్రతే కీలకం

రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల గురించి వివరిస్తూ "రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా మార్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో సీమను అభివృద్ధి చేస్తాం. రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నెలాఖరులో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు నీరందిస్తామన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడామని గుర్తుచేశారు. చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత భవిష్యత్తు మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి తెలిపారు. "గోదావరి-కృష్ణా, తుంగభద్ర, పెన్నా-కావేరీ నదుల అనుసంధానంతో 4 రాష్ట్రాల్లో నీటి సమస్యలు తీరతాయి. గంగ, మహానది, గోదావరి నదులను కూడా కలిపితే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. నీటి భద్రత సాధిస్తే దేశాభివృద్ధి అన్‌స్టాపబుల్" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# 22ఏ నిషేధిత భూముల అంశంలో భయపడాల్సిన అవసరం లేదు

ఇందులో రిపీట్ కాల్స్‌ను తొలగిస్తే 980 ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వాటిలో 547 వ్యవసాయ సంబంధిత సమస్యలు కాగా 433 వ్యవసాయేతర అంశాలకు సంబంధించిన కాల్స్ ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులను జిల్లాల వారీగా అధికారులకు పంపించి పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. 22ఏ అంశంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను భయపెడుతున్నాయని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. గతంలో రిలాక్సేషన్ వచ్చిన నిజమైన కేసుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చెప్పారు. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయలేని వాటిని మాత్రం చేయలేమని స్పష్టం చేశారు. కొంతమంది దొంగ జీవోలు, నకిలీ మెమోలు తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ల కోసం ఒత్తిడి చేస్తున్నారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. అలాంటి వ్యవహారాలకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నకిలీ పత్రాలతో వివాదాస్పద భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు.1908 రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన్ భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చే అవకాశం ఉంది. అయితే భూముల జాబితా నవీకరణ సమయంలో కొన్ని చోట్ల ఒకే సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేట్ పట్టా భూములు ఉన్నప్పటికీ మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడంతో సమస్య తలెత్తినట్లు ప్రభుత్వం చెబుతోంది. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో పలువురు ఆస్తి యజమానులు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలతో పాటు గతంలో అనుమతులతో అభివృద్ధి చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన ఆస్తులు కూడా కొన్ని సందర్భాల్లో నిషేధిత జాబితాలో కనిపించడంతో ప్రస్తుతం తీవ్ర గందరగోళం నెలకొంది.22ఏ భూముల సమస్యలపై ప్రతి సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజలకు సంబంధించిన నిజమైన సమస్యలను వేగంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్లాట్ల బుకింగ్ కోసం డబ్బులు చెల్లించి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి న్యాయం చేస్తామని అర్హత ఉన్న స్లాట్ బుకింగ్ కేసుల్లో ఫాస్ట్‌ట్రాక్ విధానంలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

# టెక్నాలజీతో ప్రభుత్వ సేవలు మరింత సులభతరం


20 శాతం తగ్గే అవకాశం ఉందని అంచనా వేశారు. కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా నీరందించగలమని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. సాగు ప్రారంభించని చోట్ల వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతులకు పంపే క్రాప్ అలర్ట్‌లపై తీసుకుంటున్న చర్యలను కూడా పర్యవేక్షించాలని, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని స్పష్టం చేశారు.అలాగే, ప్రజారోగ్యంపై కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో డెంగీ, మలేరియా వ్యాధుల నివారణకు వ్యాధి ప్రబలుతున్న హాట్‌స్పాట్‌లను గుర్తించి, తక్షణ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయితే, గతేడాదితో పోలిస్తే ఈసారి డెంగీ కేసులు గణనీయంగా తగ్గాయని అధికారులు వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి 1,361 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 401 కేసులు మాత్రమే నమోదైనట్టు తెలిపారు. రాష్ట్రాన్ని కార్బన్ న్యూట్రల్ లక్ష్యం వైపు నడిపించాలని సీఎం ఆకాంక్షించారు. ఇందుకోసం పునరుత్పాదక ఇంధన వనరులపై, ముఖ్యంగా సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుపై దృష్టి సారించి, ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.

# పార్టీలో ఎవరైనా నిబంధనలు పాటించాల్సిందే

**- కొండా సురేఖ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన**

**- సీఎంపై కుమార్తె వ్యాఖ్యలతో కొండా సురేఖకు షోకాజ్ నోటీసు**

**- కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమంటూ మంత్రి ఇచ్చిన వివరణ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మిత వ్యాఖ్యల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి స్పందించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత అంశాలపై తాను బహిరంగంగా చర్చించబోనని తేల్చిచెప్పారు. అలాగే ఊహాజనిత కథనాలను ప్రచురించవద్దని క్రమశిక్షణ కమిటీ, పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే అందరికీ వర్తిస్తుందని పేర్కొన్నారు.హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన అంశంపై మీడియా ప్రతినిధులుప్రశ్నించారు. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. నేతల క్రమశిక్షణకు సంబంధించిన అంశాలను కమిటీ పరిశీలిస్తోందని అన్ని విషయాలను పరిశీలించిన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. కాంగ్రెస్‌లోని ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ అధిష్ఠానం నిర్ణయాలకు కట్టుబడి ఉండాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా దాన్ని అందరూ అంగీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ అంతర్గత సమస్యలు, అభిప్రాయ భేదాలను పార్టీ వేదికలపైనే చర్చించుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంపై మీడియాలో వస్తున్న వివిధ కథనాల గురించి కూడా సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వాస్తవాల ఆధారంగా కాకుండా ఊహాజనితంగా ప్రచురించే కథనాలపై తాను స్పందించబోనని స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ పూర్తి స్థాయిలో అంశాన్ని పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

# అమెరికా పర్యటనను అడ్డుకున్నారు, కానీ నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు

తమ పార్టీ సభ్యులు ప్రస్తావిస్తారని తేల్చి చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు మాత్రం అమెరికాలో పర్యటించేందుకు అనుమతించారని కానీ తనకు మాత్రం అనుమతి నిరాకరించారని ఆరోపించారు.నరేంద్ర మోదీ దేశానికి ప్రధానమంత్రిగా కాకుండా గుజరాత్ వ్యక్తిగా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తాను అమెరికాలో పర్యటిస్తే తెలంగాణకు పెట్టుబడులు వస్తాయని విద్య, క్రీడా రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించి తన పర్యటనను రద్దు చేశారని ఆరోపించారు. అదే సమయంలో తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు, విదేశీ సంస్థల భాగస్వామ్యం గుజరాత్‌కు తరలించుకుపోయేందుకే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు అనుమతించారని మండిపడ్డారు.తన అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించిన సీఎం రేవంత్ రెడ్డి కానీ తన లక్ష్యాలైన తెలంగాణ అభివృద్ధి, తెలంగాణ రైజింగ్ 2047ను మాత్రం అడ్డుకోలేరని తేల్చి చెప్పారు.

తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనేదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. తెలంగాణకు పెట్టుబడులను సాధించుకువచ్చేందుకే విదేశీ పర్యటన రూపొందించామని అయితే దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని దాన్ని మోదీ ప్రభుత్వం చెడగొడుతోందని మండిపడ్డారు.

అమెరికా పర్యటనలో ప్రపంచంలోనే ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పామని రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్రం తమకు బదులిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చి అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ ముఖ్యమంత్రికి మాత్రం అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారని పేర్కొన్నారు. తన పర్యటనను అడ్డుకోవడం అంటే అది రేవంత్ రెడ్డికి జరిగిన అవమానం కాదని 4 కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని తేల్చి చెప్పారు.

# మోడీ కేబినెట్ ప్రక్షాళన ఖరారు!

## 20 మంది అవుట్ లేదా శాఖ మార్పు?





**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేంద్ర కేబినెట్ ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైన ప్రధాని మోడీ, వివిధ కారణాలతో దాన్ని కాస్తా వాయిదా వేసుకున్నారు. అయితే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా జాతీయ స్థాయిలో ఒక్కసారిగా పెనుమార్పులు సంభవించాయి. అదే సమయంలో వీటి ప్రభావం త్వరలో జరిగే మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై పడేలా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగా బీజేపీ జాతీయ కార్యవర్గంలో మార్పులు చేర్పులు చేసిన మోడీ ఇప్పుడు తన కేబినెట్ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ముహూర్తం కూడా ఖరారైనట్లు తెలుస్తోంది.దేశంలో మారిన పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతల్ని మార్చుకోవడంతో పాటు తిరిగి జనంలో విశ్వాసం పెంచుకోవడానికి ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. ముఖ్యంగా రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా కేబినెట్లో మార్పులు చేసుకోవాలని మోడీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈసారి కేబినెట్ మార్పులు కచ్చితంగా జాతీయ స్థాయిలో కీలక సంకేతాలు ఇచ్చే విధంగా ఉంటాయని చెప్తున్నారు. ఇప్పటికే కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధం చేసుకున్న ప్రధాని మోడీ.. అందులో భాగంగానే ఇద్దరు మంత్రులకు రాజ్యసభ కొనసాగింపు ఇవ్వలేదు, అలాగే మరో ముగ్గురిని ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఇన్ ఛార్జ్ లుగా పంపారు.ఇప్పుడు కేబినెట్లో మిగిలిన మంత్రుల్లోనూ పలువురికి ఉద్వాసన పలికేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అలాగే మరికొందరు శాఖల మార్పు తప్పనిసరి అవుతోంది. ఇందులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. ఆమెను వేరే శాఖకు పంపి, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ను ఆర్థికమంత్రిగా నియమించే అవకాశముంది. అలాగే రెగ్యులర్ విద్యాశాఖ మంత్రిని కూడా నియమించే అవకాశం ఉంది. అలాగే పలు కీలక శాఖల్లోనూ మార్పులు ఉంటాయని తెలుస్తోంది.ఇలా చూస్తే మొత్తం మీద 20 మంది మంత్రుల వరకూ వేటు లేదా శాఖల మార్పు ముప్పు ఎదుర్కుంటున్నట్లు ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఇందులో భాగంగా పలువురు జూనియర్ మంత్రులపై వేటు పడొచ్చని చెప్తున్నారు. లేదా వేరే శాఖలకూ పంపే అవకాశం ఉంది. అలాగే ఎన్నికలు జరిగే యూపీ, గుజరాత్, పంజాబ్ నుంచి కొత్త మంత్రులు కేబినెట్లోకి రాబోతున్నారు.

# సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

**- అందుబాటులో ఉన్న అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులకు వివరించారు. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులందరూ నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్ పెంచాలని ఈ సందర్భంగా సూచించారు.ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తి కావని, భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ అనుమతులకు సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై చర్చించారు. సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి అని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి అని సూచించారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావు అని చెప్పుకొచ్చారు. భూసేకరణ, ఆర్‌డఆర్, ఫారెస్టు క్లియరెన్సులకి సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టండి అని పిలుపునిచ్చారు. ఈ అత్యవసర సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్,రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్ల పల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్,మట్టా రాగ మాయి,మందుల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లక్ష్మి కాంత రావు,రామ్ దాస్ నాయక్,కడియం శ్రీహరి,డాక్టర్ సంజయ్,బత్తుల లక్ష్మారెడ్డి,మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు హాజరయ్యారు.

# ప్రమాద బీమా చెక్కును పంపిణీ చేసిన మండల టిడిపి అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి...



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండలం బి ఉప్పులూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యుడు మాధవ రాయుడు ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మాధవ రాయుడు కి టిడిపిలో సభ్యత్వం ఉండడంతో వారి కుటుంబానికి అండగా నిలవాలని టిడిపి అధిష్టానం ఐదు లక్షల రూపాయల చెక్కును మంజూరు చేశారు. మంజూరు అయిన చెక్కును మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి బాధితురాలు కృష్ణకుమారికి ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు టిడిపి అధిష్టానం అండగా ఉంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిన్న రంగయ్య, సురేష్ నాయుడు, నాగేంద్ర, బాబు నాయుడు పాల్గొన్నారు.

# పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

**- అహంకారం వీడాలని చంద్రబాబుకు జగన్ సూచన**



అమరావతి (ప్రశ్న న్యూస్) స్టైపండ్ పెంపు సహా పలు డిమాండ్లపై ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల సమ్మె కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై మాజీ సీఎం వైఎస్ జగన్ విమర్శలు గుప్పించారు. ప్రాణాలు కాపాడే జూనియర్ డాక్టర్లను రోడ్డెక్కించి, పేద రోగుల ప్రాణాలతో చెలగాటమాడతారా అంటూ ఏపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ప్రశ్నించారు. రాష్ట్రంలోని 19 ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన 9 వేల మంది ఇంటర్న్‌లు, పీజీలు, సూపర్ స్పెషాలిటీ, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు రెండు వారాలుగా ఆందోళన చేస్తుంటే ముఖ్యమంత్రి ఎందుకు స్పందించడం లేదని జగన్ ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం జనవరి 1 నుంచి అమలుకావాల్సిన స్టైపెండ్ సవరణను ఎందుకు నిలిపివేశారని నిలదీశారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో జూడాలకు జీవో నంబర్ 287 నిర్దేశించిన 15 శాతం కంటే అధికంగా 42.4 శాతం పెంచి ఇచ్చినట్లు జగన్ గుర్తు చేశారు. సూపర్ స్పెషాల్టీ కోర్సు చేసేవారిని సీనియర్ రెసిడెంట్స్‌గా గుర్తిస్తూ, నిర్దేశించిన దానికంటే మొత్తంగా 77శాతం వారికి పెంచినట్లు తెలిపారు. ఆయుష్ విభాగానికి చెందిన జూనియర్ డాక్టర్లకు కూడా అల్లోపతి జూనియర్ డాక్టర్ల తరహాలోనే స్టైపెండ్ పెంచినట్లు వెల్లడించారు. పెరిగిన ధరలు, ద్రవ్యోల్బణం, జీవన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని జూడాలు 15 శాతం కంటే ఎక్కువ పెంపు ఇవ్వాలని కోరుతుంటే ప్రభుత్వం కేవలం 3 నుంచి 5 శాతం పెంచుతామని చెప్పడం అన్యాయం కాదా అని జగన్ ప్రశ్నించారు.జూనియర్ డాక్టర్ల శ్రమతోనే ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో వైద్యసేవలు నడుస్తున్నాయని జూడాల సమ్మె కారణంగా క్యాజువాలిటీ, ఐసీయూ, లేబర్ రూమ్ వంటి అత్యవసర సేవలకు కూడా అంతరాయం ఏర్పడుతోందని జగన్ పేర్కొన్నారు. ఫలితంగా పేద రోగులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని ఈ పరిస్థితికి ప్రభుత్వ మొండివైఖరే కారణమని విమర్శించారు. ఇప్పటికైనా చంద్రబాబు అహంకారం వీడాలని జూనియర్ డాక్టర్ల ప్రతినిధులను వెంటనే చర్చలకు పిలవాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు, జూనియర్ డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సూచించారు. జూనియర్ డాక్టర్లకు స్టైపండ్‌ను పెంచి, సమ్మెను విరమింపజేయడం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జగన్ డిమాండ్ చేశారు.

# ఫీజు బకాయిల రగడ

**- బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు.

### రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఈ డ్రామా: పొన్నం ప్రభాకర్

రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

# ఆకలి తీర్చే విద్యాలయాలు..
# మన ప్రభుత్వ పాఠశాలలు

**- మంథని విద్యార్థుల కోసం సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**
**- ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని సంకల్పం**
**- రూ.7.5 కోట్ల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ఆధునిక సెంట్రలైజ్డ్ కిచెన్**
**- గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు**






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఏ విద్యార్థి కూడా ఆకలితో పాఠశాలకు వెళ్లకూడదనే లక్ష్యంతో పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో అత్యాధునిక సెంట్రలైజ్డ్ కిచెన్ సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు మంథని ఎమ్మెల్యే, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఈ మెగా కిచెన్ ను ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం, ప్రతి రోజు పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని పాఠశాలతో పాటు జూనియర్ కాలేజీ విద్యార్థులకు సైతం అందిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచేందుకు అల్పాహార పథకం దోహదపడుతుందని అన్నారు. మంథనిలో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ.7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సోమవారం మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో తయారు చేసిన అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి మంత్రి స్వీకరించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2011లో హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఆసుపత్రుల్లోని రోగుల సహాయకులకు ఆహారం అందించే కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. తమ సంస్థకు 10 మైళ్ల దూరంలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న గొప్ప ఆలోచన కలిగించిన వరల్డ్ వైడ్ హరే కృష్ణ మూవ్ మెంట్ ఫౌండర్ , విశ్వగురు శ్రీల ప్రభు పాద వారి స్ఫూర్తితో ట్రస్టు ఆధ్వర్యంలో చేస్తున్న మంచి పనులే తమ ప్రభుత్వానికి స్ఫూర్తినిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

### - సీఎం కొడంగల్ లో పైలట్ ప్రాజెక్ట్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వంలో తొలుత కొడంగల్ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామన్న మంత్రి శ్రీధర్ బాబు, ఆ పథకం అమలు ఫలితంగానే కొడంగల్ నియోజకవర్గంలో విద్యార్థుల హాజరు 21 శాతం పెరిగిందని చెప్పారు. ప్రస్తుతం కొడంగల్‌తో పాటు మధిరలో కూడా ఈ పథకం అమలవుతోందన్నారు. రాష్ట్రంలోనే 3వ కేంద్రంగా మంథనిలో ఈ బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు.

### - గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోశలు చేస్తాం :

సింగరేణి సీఎస్ఆర్ నిధులతో మంథనిలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కిచెన్‌లో ఆధునిక యంత్రాలను వినియోగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం ఈ వంటశాలకు ఉందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఒకే రకమైన ఆహారం కాకుండా వివిధ రకాల అల్పాహారాన్ని అందించేలా ప్రత్యేక మెనూను రూపొందించినట్లు తెలిపారు. వారానికి కనీసం మూడు రోజులైనా విద్యార్థులకు పాలు అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. పోషకాహారంతో కూడిన అల్పాహారం తీసుకోవడం వల్ల పిల్లల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. అల్పాహారం తీసుకునే సమయంలో విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. గతంలో ఆహారం తీసుకోకుండానే పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేదని ఓ విద్యార్థిని తన అనుభవాన్ని మంత్రితో పంచుకుంది. ఇకపై ఇలాంటి పరిస్థితి ఏ విద్యార్థికీ రాకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు అన్నారు.

### - పిల్లల ఆకలి తీరిస్తేనే మాకు సంతృప్తి : శ్రీ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆకలి తీరిస్తేనే తమకు అసలైన సంతృప్తి కలుగుతుందని హరే కృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ అన్నారు.

### - ఆకలికి కారణాలు ఏవైనా , మేమున్నాం మీకు తోడుగా ...

ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు వచ్చేటప్పుడు పిల్లలు అనేక కారణాల వల్ల ఆకలితో వస్తారని , అలాంటి సమయంలో పిల్లలు చదువుకునేందుకు ఇబ్బందులు వస్తుంటాయని , అలాంటి వారికి బ్రేక్ ఫాస్ట్ కిచెన్ తో ఆకలి బాధలు తీరిపోతాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో తాము విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ముందుకు వచ్చామన్నారు. బడి పిల్లలు ఈ సేవలను ఉపయోగించుకుని , బాగా చదువుకుని ప్రయోజకులు అయితే తాము సంతోషిస్తామని , తమ సేవకు అదే అసలైన ఆనందం అని అన్నారు.

### - విద్యాశాఖకు పెద్దపీట : కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మంత్రి శ్రీధర్‌బాబు సూచనల మేరకు జిల్లాలో విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అధ్యయనాల ప్రకారం విద్యాశాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కొత్త ఉపాధ్యాయుల నియామకంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్తగా ప్రారంభించిన అల్పాహార పథకం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, హాజరు శాతం, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు చేస్తున్న మంచి పనికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభిస్తోందన్నారు. రామగుండం ప్రాంతానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఇటీవల ఫిన్‌లాండ్‌లో శిక్షణ పొందేందుకు ఎంపికయ్యారని తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది ఉపాధ్యాయులకు విదేశాల్లో శిక్షణ పొందే అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### - ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన ఆహారం ఉచితంగా అందుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్టమైన పునాది వేసేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సీఈఓ కౌంతేయ ప్రభూజీ, ప్రజా సంబంధాల ముఖ్య కార్యనిర్వహణ అధికారి రవిలోచన ప్రభూజీ, సహ ట్రస్టు ప్రతినిధులు, మంథని ఆర్డీవో సురేష్, మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆరిపోద్దిన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ నుంచి ఏపీకి
# అక్రమంగా చికెన్ వ్యర్థాల తరలింపు

**- చికెన్ వ్యర్థాల తరలింపును అడ్డుకున్న అధికారులు**
**- ఏపీలోని చేపల చెరువులకు చికెన్ వ్యర్థాల తరలింపు**
**- పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సైబరాబాద్ పోలీసులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా వ్యవహారం మరోసారి తీవ్ర కలకలం రేపింది. నగరంలో ఉన్న కోళ్ల దుకాణాలు, చికెన్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి భారీ మొత్తంలో చికెన్ వ్యర్థాలను సేకరించి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న చేపల చెరువులకు తరలిస్తున్న ముఠాపై సైబరాబాద్ పోలీసులు, పశువైద్య శాఖ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టి.. దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దాదాపు 100 టన్నుల చికెన్ వ్యర్థాలను అధికారులు పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. అధికారులు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కోళ్ల దుకాణాలు, మాంసం ప్రాసెసింగ్ కేంద్రాల నుంచి వెలువడే చికెన్ వ్యర్థాలను కొందరు వ్యక్తులు సేకరిస్తున్నారు. ఆ తర్వాత వాటిని లారీల్లో నింపి ఆంధ్రప్రదేశ్‌కు తరలించి అక్కడ చేపల చెరువుల యజమానులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. చేపలకు మేతగా ఉపయోగించేందుకు ఈ చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాకు సంబంధించి పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సైబరాబాద్ పోలీసులు, వెటర్నరీ అధికారులు నగరంలోని అత్తాపూర్, మియాపూర్, అమీన్‌పూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, చింతల్ వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లారీల్లో తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను గుర్తించి సీజ్ చేసుకున్నారు. భారీ మొత్తంలో వ్యర్థాలు పట్టుబడటంతో ఈ అక్రమ రవాణా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ చికెన్ వ్యర్థాలను ప్రధానంగా రాత్రి వేళల్లో ఏపీకి తరలించి అక్కడి చేపల చెరువు యజమానులకు అమ్ముతున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. గతంలోనూ ఇలాంటి వ్యవహారంపై కేసులు నమోదైనప్పటికీ ఇంకా ఈ చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గత నెలలోనూ సుమారు 100 టన్నుల చికెన్ వ్యర్థాలను అధికారులు స్వాధీనం చేసుకోగా తాజాగా మరోసారి అంతే ఎత్తున సీజ్ చేయడం గమనార్హం. చికెన్ వ్యర్థాలను చేపలకు మేతగా ఉపయోగించడం వల్ల ఆహార భద్రత, ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు తీవ్ర హెచ్చరికలు చేశారు. అపరిశుభ్రమైన వ్యర్థాలను తిని పెరిగిన చేపలను.. ప్రజలు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు తెలిపారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. చికెన్ వ్యర్థాలను అక్రమంగా సేకరించి, రవాణా చేసి, చేపల చెరువులకు విక్రయిస్తున్న నెట్‌వర్క్‌పై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రాఖీ పండుగ వేళ

**గోదావరిఖని** : అన్నాచెల్లెలు, అక్కతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి బీజేపీ శ్రేణులతో కలిసి గోదావరిఖనిలోని ఆర్జీ-1 సింగరేణి గనుల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా గనుల్లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికులను ఆప్యాయంగా పలకరించి వారి చేతులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులతో కొద్దిసేపు ముచ్చటిస్తూ వారి క్షేమ సమాచారాన్ని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ.. కుటుంబంలో ఎన్ని కోపతాపాలు, విభేదాలు ఉన్నప్పటికీ రాఖీ పండుగ రోజున అందరూ ఒక్కటై సుఖసంతోషాలతో గడుపుతారని అన్నారు. అన్నా?చెల్లెలు, అక్క?తమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆత్మీయత, అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు ముందస్తుగా ఆత్మీయతను పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కుటుంబ సభ్యుల మాదిరిగానే సింగరేణి కార్మికుల మధ్య కూడా ఐకమత్యం, సోదరభావం ఎల్లప్పుడూ కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. సింగరేణి కార్మికులు తమ కష్టాన్ని, శ్రమను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె కొనియాడారు. వారి సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా సింగరేణి కార్మికుల పట్ల బీజేపీ శ్రేణులు చూపిన ఆప్యాయత అక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ కోడూరి రమేష్, బియ్యాల మహేందర్, పాకాల నరసింహారెడ్డి, బూడిద హర్ష, కొట్టే నరేష్, శ్రీనివాస్, చింతం అంజి, గంగరాజు, ఎల్తూరి సరిత-రాజయ్య, మీసవికాస్ తదితరులు పాల్గొన్నారు..

## బీజేపీ 12 ఏండ్ల పాలనలో
# 60 సార్లు పేపర్ లీక్‌లు
### - చనగాని దయాకర్

**హైదరాబాద్** మొన్న పేపర్ లీక్ తో 22 లక్షల మంది జీవితం బుగ్గిపాలు చేసింది మీరు కదా రామ్ చందర్ రావు. బీజేపీ 12 ఏండ్ల పాలనలో 60 సార్లు పేపర్ లీక్ లు అయ్యాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. రాష్ట్రం లో ఉన్నతమైన విద్య ను అందిస్తుంది మా ప్రభుత్వం. మా పాలనలో ప్రభుత్వ స్కూల్ హాస్టల్ లలో సీట్లు దొరకడం లేదు. ఆరుట్ల స్కూల్ కి వెళ్ళి చూసి రండి రామ్ చందర్ రావు. పదేండ్ల విధ్వంసంను మా ప్రభుత్వం సెట్ చేస్తుంది. జాతీయ విద్య సంస్థలను తెలంగాణ రాష్ట్రంకు తీసుకు రావడంలో రాష్ట్ర బీజేపీ నేతలు విఫలమయ్యారని అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ పక్క రాష్ట్రం లో ఉంది మన రాష్ట్రం లో ఎందుకు లేదు. మన రాష్ట్రం పై బీజేపీ కేంద్ర ప్రభుత్వం కు ఎందుకు వివక్ష..మన రాష్ట్రం కు తీసుకు రావడానికి మీరు పోరాటం చేయండి మేము మద్దతు ఇస్తాము. ఉస్మానియా యూనివర్సిటీ కి 1000 కోట్లు కేటాయించాము కొండా సుష్మిత కు కాంగ్రెస్ పార్టీ కి సంబంధం లేదు. పిల్ల కాయలు మాట్లాడింది మేము పట్టించుకోం. కాంగ్రెస్ పార్టీ తల్లి లాంటిది. తప్పు లకు శిక్షలు ఉంటాయి.. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కోసం ప్రతి నెల 250 కోట్లు సమీకరణ చేస్తుంది. ??? ఫీజు రీయింబర్స్ మెంట్ అమలు కోసం ఆఖ విద్యార్థుల ఖాతా లోకి నేరుగా వెళ్లేలా చేసింది. అవినీతి అక్రమాలకు అవకాశం లేకుండా పారదర్శకతతో ఉండాలి అని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ లో ఏండ్లుగా ఎఐఓ ఏర్పాటు చేయలేదు దాని పైన బీజేపీ చీఫ్ రామచంద్ర రావు దీక్ష చేస్తే బాగుంటదని అన్నారు.

## టీఆరెస్ విద్యార్థి విభాగం ఛలో సెక్రటేరియట్ పిలుపు
### - పలువురు అరెస్టు

**సెక్రటేరియట్** తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం ఛలో సెక్రటేరియట్ కు పిలుపునివ్వడంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు. సెక్రటేరియట్ ముట్టడికి వెళ్లిన టీఆర్ఎస్ విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసారు. పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు సెక్రటేరియట్ ముట్టడికి టీఆర్ఎస్ విద్యార్థి విభాగం పిలుపునిచ్చింది. సెక్రటేరియట్ నలువైపులా విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ఈ నెల 25న దర్శనం,ఆర్జితసేవల
# టికెట్లు విడుదల



**శ్రీశైలం** సెప్టెంబరు మాసానికి సంబంధించి శ్రీస్వామివారి స్పర్శదర్శనం, శీఘ్ర, అతిశీఘ్రదర్శనం మరియు ఆర్జితసేవాటికెట్లను రేపు (25.08.2026) విడుదల చేయనున్నట్లు కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు సులభంగా ఆయా టికెట్లు పొందేందుకు వీలుగా 90శాతం టికెట్లను రాష్ట్ర ప్రభుత్వ మనమిత్ర వాట్సప్ ద్వారా పొందే అవకాశం కల్పించడం జరుగుతోందన్నారు. మిగిలిన 10 శాతం టికెట్లను ఏ.పి.టి.ఎస్ వారి వెబ్‌సైట్ లిలిలి.బిఎబ.జీజూ.ఐనీల.తిని ద్వారా పొందవచ్చునని అన్నారు. అలాగే పరోక్షసేవాటికెట్లను కూడా మనమిత్ర వాట్సప్ మరియు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునన్నారు.
శ్రీశైలానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా సేవలను పరోక్షంగా జరిపించుకునే వీలుగా దేవస్థానం ఈ పరోక్షసేవలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ ఆయా పౌరసేవలను సమర్థవంతంగా, వేగంగా, పారదర్శకంగా అందించేందుకు వీలుగా వచ్చిన ఈ వాట్సాప్ గవర్నెన్స్ విధానంలో పౌరులు పలు శాఖలకు సంబంధించిన ఆయా సేవలను పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆయా సేవలను సులభతరంగా అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర వాట్సాప్ నెంబరును 9552300009 అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్‌గా ఈ వాట్సాప్ విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. కాగా ఈ మనమిత్ర వాట్సాప్ ద్వారా దేవదాయశాఖ పరిధిలోని పలు ఆలయాల దర్శనం టికెట్లు, ఆర్జితసేవాటికెట్లు, ప్రసాదాల టికెట్లు మరియు విరాళాలను చెల్లించే విధానాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ క్రమములో వాట్సాప్ ద్వారా శ్రీశైలదేవస్థానం నందలి శ్రీస్వామివారి స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెట్లను పొందవచ్చునని తెలియజేశారు. అదేవిధంగా శ్రీస్వామివారి ఆర్జిత గర్భాలయఅభిషేకం, ఆర్జితసామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతిహోమం, రుద్రహోమం, మహామృత్యుంజయహోమం, చండీహోమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం మొదలైన ఆయా 14 రకాల ఆర్జితసేవలకు సంబంధించిన సేవా టికెట్లను కూడా పొందవచ్చునని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దర్శనం మరియు ఆర్జితసేవాటికెట్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. తదుపరి వారాంతపు రోజులు, సెలవురోజులు మరియు సోమవారం, ఇతర పర్వదినాలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ రోజులలో ముందస్తు టికెట్లు దొరకని భక్తులు టికెట్ అందుబాటులో ఉండే మంగళ, బుధ, గురు, శుక్రవారాలలో ఆయా టికెట్లను పొందవచ్చు. ఆయా సేవాటికెట్లు పొందినవారు విధిగా మనమిత్ర లేదా ఆన్‌లైన్ ద్వారా పొందిన టికెట్ కాపీని ( హార్డుకాపీ) మరియు ఆధార్ కార్డు ఒరిజినల్ లేదా జిరాక్స్ కాపీని తప్పని సరిగా తెచ్చుకోవలసివుంటుందన్నారు.
ఆయా సేవాటికెట్లను స్కానింగ్ జరిపి సంబంధిత టికెట్లను ఒరిజినల్ ఆధార్ గుర్తింపు కార్డుతో సరిచూసిన తదుపరే భక్తులను ఆయా ఆర్జిత సేవలకు అనుమతించడం జరుగుతుందన్నారు.
భక్తుల కోరిక మేరకు మరియు భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ఆర్జితసేవల ప్రారంభ సమయానికంటే ఒక గంట ముందు వరకు కూడా అందుబాటును బట్టి భక్తులు మనమిత్ర మరియు ఆన్‌లైన్‌లో టికెట్లను పొందే అవకాశం కల్పించడం జరిగిందన్నారు.
భక్తుల సౌకర్యార్థం దేవస్థానం పలుచోట్ల మనమిత్ర వాట్సాప్ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇక యథావిధిగా ప్రతీరోజు ఉదయం గం.4.30లనుంచి సర్వదర్శనం (ఉచిత దర్శనం)ఉంటుందన్నారు.

## కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా




ఈరోజు మహబూబాబాద్ కలెక్టరేట్ ఆఫీస్ ముందు హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ధర్నా నిర్వహించడం జరిగింది ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో అమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని గుర్తింపు కార్డులు ఉచిత వైద్యం ఎగుమతి దిగుమతి చేస్తా ఉంటే కార్మికుడు మరణిస్తే 25 లక్షల ఇవ్వాలని 55 సంవత్సరాలు దాటిన ప్రతి హమాలీ కార్మికుడికి 6000 రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఇండ్లు లేని కార్మికులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఇందిరమ్మ ఇన్ ఇవ్వాలని ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేసే హమాలీలకు నాలుగో తరగతి ఉద్యోగాలు గుర్తించాలని ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలలో అమాలి కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని నాలుగు లేబర్ కోల్డ్ లను రద్దు చేయాలని. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై అనేక సందర్భాలలో ఈ ప్రభుత్వంపై ఆందోళన పోరా నిర్వహించాం అయినా కానీ ఇప్పటివరకు వీటి ప్రస్తావనే తేవడం లేదు. కాబట్టి ఈరోజు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించడం జరిగిందిరేపు జరగబోయే అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా వివిధ మండలాల నుండి అనేక మంది కార్మికులు పాల్గొని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాము ఇప్పటికైనా ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేనియెడల రేపు రాబోయే కాలంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారుఈ కార్యక్రమంలో అంబటి వీరస్వామి ప్రవీణ్ మల్లయ్య బత్తుల వెంకన్న సతీష్ శ్రీను హేమ బాలు మహేందర్ సతీష్ ఐలయ్య రాము వెంకన్న హరినాయక్ చారి ఐలయ్య లక్ష్మణ్ లాలు మల్లేష్ ప్రసాదు రాజు వెంకటేష్ రజిని లచ్చు సేవ్య నవీను వెంకన్న మోహన్ ప్రవీణ్ పాల్గొన్నారు

# విదేశీ కలుపు మొక్కలను నిర్మూలించాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- విదేశీ ఆక్రమణ కలుపు మొక్కల నిర్మూలనపై అవగాహన**




సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) విదేశీ కలుపు మొక్కల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఈకో ఫాన్ సొసైటీ విదేశీ కలుపు మొక్కల నిర్మూలనపై అవగాహన, గుర్తింపు కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. విదేశీ ఆక్రమణ మొక్కల నిర్మూలన ఉద్యమానికి ప్రతీకగా రూపొందించిన ప్రత్యేకమైన "థంబ్స్ డౌన్" సంకేతాన్ని పాల్గొన్న వారందరూ ప్రదర్శించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ విదేశీ మొక్కల జాతుల వ్యాప్తిని అడ్డుకుని, వాటిని నిర్మూలించి, స్థానిక జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని పిలుపు నిచ్చారు. స్థానిక పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. విదేశీ కలుపు మొక్కల నిర్మూలన, స్థానిక జీవవైవిధ్య పరిరక్షణ, ప్రజల్లో పర్యావరణ అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఈకో ఫాన్ సొసైటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మెట్టుసాయి సంపత్, రాష్ట్ర సమన్వయకర్త తలారి విక్రమ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండలస్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలన**



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుండగా, ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారుల హాజరును పరిశీలించారు. గత వారం ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? తదితర అంశాలపై ఆరా తీశారు. చేయూత నూతన పెన్షన్ ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించారు. చేయూత పెన్షన్ కోసం కావలసిన వివిధ ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ అధికారులు త్వరితగతిన అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. ఆయా మండలాల ప్రజలు తమ మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రజావాణిలో ఎంపీడీఓ సత్తయ్య, డిప్యూటీ తహసీల్దార్ వేణు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విరహత్ అలీ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిడబ్ల్యూజేయూ) జర్నలిస్టు యూనియన్ నేత కాజా విరహత్ అలీ కుటుంబాన్ని మెదక్ జిల్లా నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా విరహత్ అలీ కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నవాజ్ మీరా, గోలి సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల దేవస్థానంలో రెండవ సోమవరం శ్రావణమాసోత్సవాలు

**భక్తులకు అసౌకర్యం కలగాకుండ**

**క్యూకాంప్లెక్స్, కు సంబంధ ఏఈవో**

**ఫణీంధర్ పర్యవేక్షకులు శివప్రసాద్**

**కు ప్రత్యేక సూచనలు ఈవో శ్రీనివాస్**







శ్రీశైలం (ప్రశ్నన్యూస్)భక్తులరద్దీకనుగుణంగా ఆయా ఏర్పాటు చేయబడ్డాయి. భక్తులందరు సంతృప్తికరంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా దర్శన ఏర్పాట్లు చేయడం జరిగింది. వేకువజామున గం.3.00లకు ఆలయద్వారాలు తెరచి, ప్రాత:కాల పూజల అనంతరం వేకువజామున గం. 4.30ల నుంచి సాయంకాలం గం. 4.00ల వరకు దర్శనాలు కల్పించబడుతున్నాయి. అదేవిధంగా తిరిగి సాయంత్రం గం. 5.30ల నుంచే దర్శనాలు కొనసాగుతున్నాయి. సామాన్య భక్తుల సౌకర్యార్థం శ్రావణ శనివారాలు, శ్రావణ ఆదివారాలు, శ్రావణ సోమవారాలు, శ్రావణపౌర్ణమి మొదలైన రోజులలో ( మొత్తం 19 రోజులపాటు) గర్భాలయ అభిషేకాలు సామూహిక అభిషేకాలు, అమ్మవారి కుంకుమార్చనలు పూర్తిగా నిలుపుదల చేయబడ్డాయి. అదేవిధంగా ఉదయాస్తమానసేవ, ప్రాత:కాల సేవ, ప్రదోషకాలసేవ పూర్తిగా నిలుపుదల చేయడం జరుగుతుంది. ఈ రోజులలో రాత్రివేళలో మాత్రమే పరిమితంగా స్వామివారి స్పర్శదర్శనాన్ని కల్పించడం జరుగుతుంది. వేకువజాము నుంచి రాత్రివేళల వరకు అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకై దేవస్థానం శాఖాధిపతులకు, పర్యవేక్షకులకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి. దాదాపుగా కార్యాలయం సిబ్బంది అంతా కూడా ప్రత్యేక విధులను నిర్వర్తిస్తున్నారు.

### క్యూలైన్లలో అల్పాహారం..

క్యూకాంప్లెక్స్‌లో వేచివుండే భక్తులకు నిరంతరం అల్పాహారంగా పులిహోర, పెరగన్నం, కట్టుపొంగలి మరియు మంచినీరు అందజేయబడుతున్నాయి. అదేవిధంగా ఈ ఉదయం వేళలలో వేడిపాలు కూడా అందజేయబడ్డాయి.

### అన్నప్రసాద వితరణ..


భక్తులకు అన్నదాన భవనములో ఉదయం 10.30 నుండి అన్నప్రసాదాల వితరణ చేయబడుతున్నాయి. అలాగే సాయంత్రం గం. 6.30ల నుంచి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయబడుతుంది. శ్రావణమాసంలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యలో లడ్డు ప్రసాదాలు సిద్ధం చేయబడ్డాయి.

# హబ్సిగూడ డివిజన్ బీజేపీ ఎండోమెంట్ సెల్‌లో నూతన నియామకాలు



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ హబ్సిగూడ డివిజన్ ఎండోమెంట్ సెల్ (ధార్మిక విభాగం)లో నూతన నియామకాలు చేపట్టారు. హబ్సిగూడ డివిజన్‌కు చెందిన టి. రాఘవేందర్ రెడ్డి, ఆర్. బుచ్చి రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి లను సామాజిక వర్గాల ప్రతినిధులుగా నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులు మాట్లాడుతూ తమ పై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా కన్వీనర్ చంద్రమౌళి కి, కో-కన్వీనర్ వల్లి నాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం పూర్వ శాసనసభ్యులు బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని నూతనంగా నియమితులైన నాయకులు తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతనంగా నియమితులైన వారికి అభినందనలు తెలిపారు.

# జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల అల్పాహారాన్ని పరిశీలించిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు





ఉప్పల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాలలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. అల్పాహారం నాణ్యతను స్వయంగా పరిశీలించి, రుచి చూశారు. వారానికి ఐదు రకాల టిఫిన్స్‌తో పాటు విద్యార్థులకు పాలు అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు. అల్పాహారం నాణ్యత బాగుందని ప్రతినిధుల అభిప్రాయం .అల్పాహారం తీసుకువచ్చే డబ్బాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం నాణ్యత బాగుందని, అయితే అల్పాహారం తరలించే డబ్బాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. స్కూల్‌లో మౌలిక వసతుల సమస్యలు పరిష్కరించాలి రామంతపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు సోలార్ ప్యానళ్ల కింద చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో తగినంత నీటి సౌకర్యం లేకపోవడంతో తాగునీరు, వాష్‌రూమ్‌ల వినియోగానికి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు సైకిళ్లు పెట్టుకునేందుకు ప్రత్యేక స్థలం లేక రోడ్డుపైనే సైకిళ్లు వదిలేయాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలిపాఠశాలలో నెలకొన్న సమస్యలను ఇప్పటికే అధికారుల, పాలకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆశించిన స్థాయిలో పరిష్కారం లభించలేదని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి, సంబంధిత ఉన్నతాధికారులు రామంతపూర్ పాఠశాలను స్వయంగా పరిశీలించి, తరగతి గదులు, తాగునీరు, వాష్‌రూమ్‌లు, సైకిల్ పార్కింగ్ తదితర మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోసుల విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు టి. రవీందర్ రావు పాల్గొన్నారు.

# మట్టిలో మాణిక్యాలకు అమరావతి ఛాంపియన్‌షిప్

**ఒలింపిక్ వేదికే లక్ష్యంగా క్రీడాకారులను తీర్చిదిద్దాలి: హోంమంత్రి అనిత**



తిరుపతి(ప్రశ్న న్యూస్) గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే అమరావతి ఛాంపియన్‌షిప్ లక్ష్యమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం



ఇవ్వాలని, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. తిరుపతిలోని తారకరామా గ్రౌండ్స్‌లో అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హోంమంత్రి అనిత జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. రెవెన్యూ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రవాణా--క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, క్రీడాశాఖ అధికారులు పాల్గొన్నారు.

### 9 వేల మందికి పైగా క్రీడాకారులు

రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 9 వేల మందికి పైగా అండర్--17, అండర్--23 బాలబాలికల క్రీడాకారులు ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. ఇంత భారీ సంఖ్యలో యువ క్రీడాకారులు ఒకే వేదికపై పోటీ పడటం రాష్ట్ర క్రీడారంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోందని హోంమంత్రి అన్నారు. మారుమూల గ్రామాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని 'మట్టిలో మాణిక్యాలను' గుర్తించి వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే ప్రపంచస్థాయి క్రీడాకారులుగా ఎదగగలరని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి నుంచి క్రీడాకారులు పతకాలతో మాత్రమే కాకుండా గొప్ప లక్ష్యంతో తిరిగి వెళ్లాలని అనిత పిలుపునిచ్చారు. "నేను సాధించాలి.. నా తల్లిదండ్రులకు, నా పాఠశాలకు, నా జిల్లాకు, ఆంధ్రప్రదేశ్‌కు, దేశానికి పేరు తీసుకురావాలి" అనే సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. శ్రీవారి ఆశీస్సులతో ప్రతి క్రీడాకారుడు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని హోంమంత్రి ఆకాంక్షించారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలకు సన్నాహాలు

**తుగ్గలి:** గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల పరిధిలోని గల 23 గ్రామపంచాయతీల పోలింగ్ కేంద్రాల నమూనాలను ఏర్పాటు చేశామని తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్ తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం రోజున ఆయన మాట్లాడుతూ రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు-2026 నేపథ్యంలో తుగ్గలి మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితా నందు గత ఎన్నికల్లో ఎక్కడైతే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారో, అదే ప్రాంతాల్లో ప్రస్తుతం కూడా పోలింగ్ స్టేషన్లను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ డ్రాఫ్ట్ పబ్లికేషన్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులు,ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు, సమస్యలు ఉంటే రెండు రోజులలోగా ఎంపీడీవో కార్యాలయంలో వ్రాతపూర్వకంగా తెలియజేయాలని తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్ తెలియజేశారు.

# నేరాల నియంత్రణకు 'నేను సైతం 2.0'

**కీసరలో 150 సీసీ కెమెరాల ప్రారంభం**

**'నేను సైతం 2.0'లో భాగంగా 9 కాలనీల్లో నిఘా వ్యవస్థ ఏర్పాటు**

**ఏడాదిలో లక్ష కెమెరాల ఏర్పాటు లక్ష్యం: మల్కాజిగిరి కమిషనరేట్**



కీసర( ప్రశ్న న్యూస్) తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నేను సైతం 2.0' కార్యక్రమంలో భాగంగా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో 150 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి, ఐపీఎస్ సోమవారం ప్రారంభించారు. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని 9 కాలనీలను సమగ్రంగా సర్వే చేసి, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు అత్యంత అవసరమైన ప్రాంతాలను గుర్తించి కెమెరాలను ఏర్పాటు చేశారు. మొత్తం 150 కెమెరాల్లో 142 'నేను సైతం 2.0' కెమెరాలు, 8 ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఉన్నాయి. వీటి ద్వారా నేరాల నియంత్రణతో పాటు వాహనాల కదలికలపై నిఘా, అనుమానాస్పద వ్యక్తులు--వాహనాల గుర్తింపు, ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయనున్నారు.

### కమ్యూనిటీ భాగస్వామ్యంతో స్మార్ట్ నిఘా

"ఒక నిఘా కెమెరా వెయ్యి మంది పోలీసులతో సమానం" అనే భావనతో "పోలీసులతో ప్రజలు.. ప్రజలతో పోలీసులు" అనే నినాదంతో 'నేను సైతం 2.0' కార్యక్రమాన్ని చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రతి నివాస, పారిశ్రామిక, కమ్యూనిటీ ప్రాంతాన్ని నిఘా పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయి.

### కమిషనరేట్‌లో 2.58 లక్షల కెమెరాలు

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం 2,58,058 సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 13,230 కమ్యూనిటీ కెమెరాలు, 2,44,828 'నేను సైతం' కెమెరాలు ఉన్నాయి. 2026లో ఇప్పటివరకు 29,607 'నేను సైతం' కెమెరాలు, 428 కమ్యూనిటీ కెమెరాలు ఏర్పాటు చేయగా, 5,377 కమ్యూనిటీ కెమెరాలను పునరుద్ధరించారు.'నేను సైతం 2.0' ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రెండు దశల్లో 7,136 కెమెరాలు ఏర్పాటు చేశారు. జూలై 1 నుంచి 6 వరకు జరిగిన తొలి దశలో 3,976 కెమెరాలు, ఆగస్టు 15 నుంచి 24 వరకు జరిగిన రెండో దశలో 3,160 కెమెరాలు ఏర్పాటు చేశారు.

### సీసీ కెమెరాలతో 116 కేసుల ఛేదన

2026లో ఇప్పటివరకు సీసీ కెమెరాల ద్వారా 116 కేసుల్లో కీలక సాంకేతిక ఆధారాలు లభించాయని పోలీసులు వెల్లడించారు. హత్యలు, దోపిడీలు, రాత్రివేళ ఇళ్లలో చోరీలు వంటి పలు కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేశాయి.

### ఏడాదిలో లక్ష కెమెరాల లక్ష్యం

2026--27 సంవత్సరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో దాదాపు లక్ష కెమెరాలను ఏర్పాటు చేయడం లక్ష్యంగా 'నేను సైతం 2.0' కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రత, వాహనాల ట్రాకింగ్, హాట్‌స్పాట్‌లపై నిరంతర నిఘా కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

# ఫీజుల బకాయి-బీజేపీ లడాయి

**రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు.?**

**విద్యార్థుల భవిష్యత్తుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదా.?**

**- బీజేపీ రాష్ట్ర నాయకురాలు ఎన్. హైమారెడ్డి**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ ) రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేస్తోంది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతోంది.

విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొంటున్నారు.

### దీక్షకు అనుమతి నిరాకరణ.. అయినా వెనక్కి తగ్గని బీజేపీ

విద్యార్థుల సమస్యలపై నిరాహార దీక్ష చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా అడ్డంకులు సృష్టించిందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు ఎన్. హైమారెడ్డి ఆరోపించారు. అయితే విద్యార్థుల హక్కుల కోసం పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన రెండు రోజుల నిరాహార దీక్షలో తాను కూడా పాల్గొన్నట్లు హైమారెడ్డి తెలిపారు.

### విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు

విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లించే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుంది" అని హైమారెడ్డి స్పష్టం చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం ప్రభుత్వ పథకం మాత్రమే కాదని, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు అది కీలకమైన ఆర్థిక ఆధారమని బీజేపీ నాయకులు పేర్కొంటున్నారు.

### ప్రభుత్వంపై పెరుగుతున్న ఒత్తిడి

రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరుతున్న బీజేపీనిరాహార దీక్షల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్న నాయకులుబకాయిల చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

### బకాయిలు చెల్లించే వరకు పోరాటం ఆగదు

విద్యార్థుల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలని హైమారెడ్డి కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే విషయంలో ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ పోరాటం మరింత ఉధృతం చేస్తుందని, న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని ఆమె స్పష్టం చేశారు.

# మేఘన మా కూతురితో సమానం

**- కుటుంబ వ్యవహారాన్ని రాజకీయ రాద్ధాంతం చేశారు**

**- నెల రోజులుగా మానసికంగా వేధించారు**

**- కోర్టు పరిధిలోని అంశాలపై ఇప్పుడేమీ చెప్పలేను**

**- తప్పుడు ప్రచారంతో కుటుంబాన్ని ఇబ్బంది పెట్టారు**

**- రాజ్--మేఘన కలిసి ఉండాలని కోరుకుంటున్నాం**

**- ఇద్దరినీ కలపాల్సింది పోయి విడదీసే రాజకీయాలు తగవు**

**- జగన్ నాయకత్వంలోనే ముందుకు సాగుతాం**

**- జోగి రమేష్ విలువలతోనే రాజకీయాలు చేస్తారు**



ఇబ్రహీంపట్నం (ప్రశ్న న్యూస్) కుటుంబ వ్యవహారాన్ని రాజకీయాల్లోకి లాగి తమ కుటుంబాన్ని నెల రోజులుగా కొన్ని టీవీ, యూట్యూబ్ ఛానళ్లు మానసికంగా వేధించాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్ ఆరోపించారు. కుటుంబ పరమైన అంశాలను రాజకీయ జోక్యంతో ఏ విధంగా వ్యవహరించారో ప్రజలకు వివరించేందుకే మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేఘనను తమ కూతురితో సమానంగా చూసుకున్నామని, ఆమె తమ ఇంట్లో ఉన్న కొద్దికాలంలో కన్న కూతురి కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు.మేఘనతో రాజ్‌కు మధ్య ఏర్పడిన చిన్నపాటి సమస్యల నేపథ్యంలో తమ కుటుంబానికి చెందిన 11 మందిపై ఫిర్యాదు చేశారని జోగి రమేష్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఇటీవల కోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పొందినట్లు తెలిపారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున కొన్ని విషయాలను బహిరంగంగా వెల్లడించలేనని స్పష్టం చేశారు. అయితే కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై తీర్పు రాకముందే కొన్ని మీడియా సంస్థలు తమకు వ్యతిరేకంగా అసత్య ప్రచారం చేశాయని ఆరోపించారు.

### కూతురిలా చూసుకున్నాం..

మేఘనను తమ కుటుంబ సభ్యురాలిగానే భావించామని జోగి రమేష్ తెలిపారు. తన భార్య ఆమెను కన్న కూతురిలా చూసుకునేదని, గోరుముద్దలు తినిపించేదని చెప్పారు. తమ కుటుంబంలో మతపరమైన విషయాల్లోనూ ఎలాంటి వివక్ష లేదన్నారు. తన భార్య బైబిల్ చదివినా, తాము తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాలకు వెళ్లినా అది కుటుంబ జీవితంలో సాధారణ విషయమేనని పేర్కొన్నారు.
అలాంటి కుటుంబ సంబంధాలను తప్పుగా చిత్రీకరించి కొన్ని టీవీ, యూట్యూబ్ ఛానళ్లు నెల రోజులపాటు మితిమీరిన ప్రచారం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసత్య ప్రచారంతో తమ కుటుంబ సభ్యులు మానసిక క్షోభకు గురయ్యారని అన్నారు. కుటుంబంలో చోటుచేసుకున్న విషయాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.

### కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ తెలుసు..

తనపై గతంలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఇలాంటి ఒత్తిళ్లకు తాను భయపడే వ్యక్తిని కాదని జోగి రమేష్ అన్నారు. "కల్తీ కేసు పెట్టి మూడు జైళ్లకు తిప్పినా భయపడలేదు. 83 రోజులపాటు జైల్లో పెట్టినా వెనక్కి తగ్గలేదు. ఇంటిపై యాసిడ్ దాడి జరిగినా భయపడలేదు" అని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల వెనుక కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ ఏమిటో తనకు తెలుసని వ్యాఖ్యానించారు. కొన్ని మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు ఐ-టీడీపీని ఉపయోగించుకుని వ్యాపారం చేస్తున్నాయంటూ ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత వర్గాలు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. తన గొంతును ఎందుకు నొక్కే ప్రయత్నం చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలని కోరారు.

### రాజ్--మేఘన కలిసి ఉండాలి..

రాజ్, మేఘన ఇద్దరూ కలిసి ఉండాలని తాము కోరుకుంటున్నామని జోగి రమేష్ తెలిపారు. ఇద్దరు వ్యక్తుల మధ్య సమస్య వస్తే వారిని కలిపే ప్రయత్నం చేయాలి తప్ప.. రాజకీయ జోక్యంతో విడదీసే ప్రయత్నాలు చేయకూడదన్నారు. కుటుంబ వ్యవహారాన్ని రాజకీయ అంశంగా మార్చడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని చెప్పారు.తాను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌ను వ్యక్తిగతంగా ఎప్పుడూ ఎదుర్కోలేదని, రాజకీయంగా మాత్రమే విభేదించామని జోగి రమేష్ తెలిపారు. వసంత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి కొన్ని డ్రామాలు నడిచాయని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వర్గాల వివరణ రావాల్సి ఉందన్నారు.

### రాజకీయాల్లో విలువలు ముఖ్యం..

జోగి రమేష్ ఎప్పటికీ తప్పు చేయరని, విలువలకు కట్టుబడి రాజకీయాలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. అధికారంలో ఎవరూ శాశ్వతంగా ఉండరని వ్యాఖ్యానించారు. "ఎప్పుడూ ఒకరే పరిపాలించరు.. మహామహులే మట్టి కరిచారు" అని అన్నారు. తనకు కూడా ఒక సమయం వస్తుందని వ్యాఖ్యానించారు.టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తన స్థానంలో ఉండి ఆలోచించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడేళ్లలో తమ కుటుంబంపై అనేక దాడులు జరిగాయని ఆరోపించారు. ప్రాణం ఉన్నంతవరకు తాను పార్టీకి కట్టుబడి ఉంటానని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

### రెడ్‌బుక్.. డెడ్‌బుక్‌గా మారింది..

రాజకీయ కక్ష సాధింపులకు ఉపయోగపడుతోందంటూ గతంలో ప్రతిపక్షాలు విమర్శించిన 'రెడ్‌బుక్' అంశాన్ని ప్రస్తావిస్తూ ఇప్పుడు అది 'డెడ్‌బుక్'గా మారిందని జోగి రమేష్ వ్యాఖ్యానించారు. అధికార మదంతో వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందని పేర్కొన్నారు.కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై ముందుగానే టీవీ ఛానళ్లలో తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమన్నారు. తనను సంప్రదించిన వారికి వాస్తవ పరిస్థితులను వివరించాలని కోరారు.

తప్పుడు ప్రచారం గురించి తన భార్యను కూడా అడిగి తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు."దేవుడు అన్నీ చూస్తున్నాడు. కుటుంబ సమస్యలను రాజకీయాలకు దూరంగా ఉంచాలి. ఇద్దరు వ్యక్తులను కలపాలని కోరుకోవాలి తప్ప.. వారిని విడదీసేందుకు రాజకీయాలు చేయకూడదు. ఈ విషయాన్ని ఇంతటితో ముగిస్తే మంచిది" అని జోగి రమేష్ అన్నారు.

# ఏడేళ్ల నిరీక్షణకు తెర.. డీఎస్సీ విజేతలే సాక్షి





రాజమహేంద్రవరం(ప్రశ్న న్యూస్) ఏడేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూసిన అభ్యర్థుల నిరీక్షణకు తెరపడిందని, కష్టపడి సాధించిన ఉపాధ్యాయ ఉద్యోగాలపై దుష్ప్రచారం చేయడం సరికాదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల డీఎస్సీలో విజయం సాధించి ఉపాధ్యాయులుగా నియమితులైన నగరానికి చెందిన ఐదుగురు నూతన ఉపాధ్యాయినులను ఆయన స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి అభినందించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి విజయగాథలను తెలుసుకున్నారు.10వ డివిజన్‌కు చెందిన ముసలిగంటి సంతోషి రమా కల్యాణి, 3వ డివిజన్‌కు చెందిన గంటి గేయరూపిణి, 45వ డివిజన్‌కు చెందిన నయనాల కేదారేశ్వరి, 37వ డివిజన్‌కు చెందిన గిరిజ కుమారి, 35వ డివిజన్‌కు చెందిన కుసుమ రత్న సౌజన్యలను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. నగరానికి చెందిన ప్రసిద్ధ రత్నం పెన్నులను జ్ఞాపికలుగా అందజేశారు.

### గర్భిణీగా ఉన్నా.. పట్టుదలతో చదివి

డీఎస్సీ నోటిఫికేషన్ సమయంలో గర్భిణీగా ఉన్న ఓ అభ్యర్థిని ప్రసవం అనంతరం కూడా పరీక్షకు సిద్ధమై విజయం సాధించడం ప్రత్యేకంగా నిలిచింది. కుటుంబ బాధ్యతలు, శారీరక ఇబ్బందులను అధిగమించి లక్ష్యాన్ని చేరుకున్న ఆమె పట్టుదలను ఎమ్మెల్యే అభినందించారు.ప్రభుత్వ పాఠశాల నుంచి.. ప్రభుత్వ ఉపాధ్యాయినిగామరో అభ్యర్థిని ప్రభుత్వ పాఠశాలలో చదివి, అదే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయురాలిగా సేవలందించే స్థాయికి చేరుకోవడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే చదువును కొనసాగించి ఉద్యోగం సాధించిన వారి కృషిని కొనియాడారు.

### భర్త ప్రోత్సాహంతో కల సాకారం

చిన్న వయసులోనే వివాహమైనప్పటికీ చదువును కొనసాగిస్తూ, భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను పూర్తి చేసి డీఎస్సీలో విజయం సాధించిన మరో ఉపాధ్యాయినిని ఎమ్మెల్యే అభినందించారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం విజయానికి బలమైన పునాది అని పేర్కొన్నారు.

### దుష్ప్రచారం సరికాదు

కష్టపడి ఉద్యోగాలు సాధించిన డీఎస్సీ అభ్యర్థులపై వైకాపా నేతలు అవినీతి ఆరోపణలు చేయడం, డబ్బులు ఇచ్చి ఉద్యోగాలు పొందారంటూ ప్రచారం చేయడం సరికాదని ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నిర్వహించి నియామక ప్రక్రియను పూర్తి చేసిందని తెలిపారు."నిజం ఎప్పటికైనా నిజమే. అబద్ధాన్ని పదిసార్లు చెప్పినంత మాత్రాన అది నిజం కాదు. మీ కష్టంతో మీరు ఉద్యోగాలు సాధించారు. మీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి" అని నూతన ఉపాధ్యాయినులకు ఎమ్మెల్యే సూచించారు.

### మీ చేతుల్లోనే భవిష్యత్ తరాలు

ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపడుతున్న వారు తమ విజయంతో ఆగిపోకుండా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. వారి చేతుల మీదుగా మంచి విద్యార్థులు, బాధ్యతాయుతమైన పౌరులు, ఉత్తమ అధికారులు తయారుకావాలని అన్నారు. "గురుదేవోభవ" అనే మాటకు తగ్గట్టుగా ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తీసుకురావాలని సూచించారు. ఏడేళ్ల నిరీక్షణ అనంతరం ఉద్యోగాలు సాధించిన నూతన ఉపాధ్యాయినుల విజయగాథలు, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలనుకునే వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# బడులకు బెంచీల బాసట

**ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 బెంచీల పంపిణీ**

**కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ పాఠశాలలకు అందజేత**

**సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విజ్ఞప్తి**





కోవూరు (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యానికి ముప్పవరపు ఫౌండేషన్ చేయూతనందించింది. కోవూరు, బుచ్చిరెడ్డిపాళెంలోని రెండు ప్రభుత్వ పాఠశాలలకు 100 బెంచీలను అందజేసింది. విద్యార్థుల అవసరాలను గుర్తించి ఫౌండేషన్ చేపట్టిన సేవా కార్యక్రమాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు.సోమవారం బుచ్చిరెడ్డిపాళెం డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కోవూరు ప్రభుత్వ బాలికల పాఠశాల, బుచ్చిరెడ్డిపాళెం డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ పాఠశాలలకు మొత్తం 100 బెంచీలను ముప్పవరపు ఫౌండేషన్ తరఫున మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమారుడు హర్షవర్ధన్ అందజేశారు.
ప్రభుత్వ పాఠశాలల్లో బెంచీల కొరత ఉందని గతంలో హర్షవర్ధన్ భార్య రాధమ్మ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి స్పందించి 100 బెంచీలు అందించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని బెంచీలు అందించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారని పేర్కొన్నారు.ముప్పవరపు వెంకయ్యనాయుడు కుటుంబం విద్య, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటోందని ఎమ్మెల్యే అన్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం సమీపంలోని స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వెంకయ్యనాయుడు, ఆయన కుటుంబ సభ్యులు హర్షవర్ధన్, దీపమ్మ, రాధమ్మ చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. కోవూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం బెంచీలు అందించిన ముప్పవరపు ఫౌండేషన్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఫౌండేషన్‌ను కోరారు.

# ‘అర్చన 31 నాటౌట్’ రివ్యూ!



ఐశ్వర్య లక్ష్మీ ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే ‘అర్చన 31 నాటౌట్’. కామెడీ డ్రామా జోనర్లో నిర్మితమైన సినిమా ఇది. మార్టిన్ ప్రకట్ నిర్మించిన ఈ సినిమాకి, అఖిల్ అనిల్ కుమార్ దర్శకత్వం వహించాడు. మలయాళంలో రూపొందిన ఈ సినిమా, 2022లోనే థియేటర్లకు వచ్చింది. అలాంటి ఈ సినిమా రీసెంటుగా ‘ఈటీవీ విన్’లో స్ట్రీమింగ్ కి వచ్చింది. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. అర్చన (ఐశ్వర్య లక్ష్మి) ఒక మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చెందిన యువతి. ఆమె ఒక స్కూల్ లో టీచర్ గా పనిచేస్తూ ఉంటుంది. కుటుంబ బరువు బాధ్యతలను ఆమెనే నిర్వహిస్తూ ఉంటుంది. స్కూల్ లో ఆమె పరిస్థితి కష్టంగా ఉంటుంది. ఆ స్కూల్ లో టీచర్లను తొలగించే ప్రక్రియ ఒకటి ప్రారంభమవుతుంది. ఆ జాబితాలో ఆమె పేరు ఉంటుంది. దాంతో జాబ్ పోతే తన పరిస్థితి ఏమిటనే ఒక ఆందోళన ఆమెకి నిద్రలేకుండా చేస్తుంటుంది. అదే సమయంలో ఆమెకి వరుసగా పెళ్లి సంబంధాలు వస్తుంటాయి. అయితే అనేక కారణాల వలన ఆ సంబంధాలు తప్పిపోతూ ఉంటాయి. అలాంటి పరిస్థితులలో ఆమెకి ఒక సంబంధం కుదురుతుంది. ప్రసాద్ తో ఆమె పెళ్లికి ముహూర్తం ఖాయమవుతుంది. ఇకపై జాబ్ లేకపోయినా ఫరవాలేదనే ఒక సంతోషంతో ఆమె ఉంటుంది. నిదానంగా తన చదువును పూర్తిచేయవచ్చని భావిస్తుంది. ‘వేణు’ అనే ఒక యువకుడు ఆమెను మౌనంగా ఆరాధిస్తూ ఉంటాడు. తన మనసులోని ప్రేమను ఆమెకి చెప్పలేకపోతాడు.

ఈ నేపథ్యంలో పెళ్లిరోజు రానే వస్తుంది. అర్చన ఇల్లంతా బంధువులతో సందడిగా ఉంటుంది. అదే సమయంలో అర్చనకి ఒక చేదు నిజం తెలుస్తుంది. ప్రసాద్ తాను ఇష్టపడుతున్న అమ్మాయితో కలిసి ఊరొదిలి వెళ్లిపోయాడనేది దాని సారాంశం. తన పెళ్లి చేసి ఊపిరి పీల్చుకుందామని భావించిన తల్లిదండ్రులకు ఏం చెప్పాలో తెలియక అర్చన నివ్వెరపోతుంది. ఆ తరువాత ఆమె ఏం చేస్తుంది? ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనేది కథ. జాబ్ చేస్తూ తన తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలనేది అర్చన ఆలోచన. సాధ్యమైనంత త్వరగా ఆమె వివాహం చేసి పంపించాలనేది తల్లిదండ్రుల ఆత్రుత. అయితే ఇలాంటి పరిస్థితులలో ఒక వైపున ఆమె కెరియర్ .. మరో వైపున ఆమె వివాహం రెండూ కూడా ప్రశ్నార్థకంగా మారతాయి. ఆ పరిస్థితులను ఆమె ఎలా ఎదుర్కొంటుంది? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను తిప్పుతూ వెళ్లాడు. అర్చన ఉద్యోగ జీవితంలోని ఒడిదుడుకులు .. పెళ్లి సంబంధాల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులతో ఫస్టాఫ్ నడుస్తుంది. ఇక ఈ రెండు సమస్యలకు ఒక పరిష్కార మార్గం దొరికింది అనుకుంటూ ఉండగానే ఆమె జీవితం మరింత చిక్కుల్లో పడుతుంది. అందుకు సంబంధించిన సన్నివేశాలతో సెకండాఫ్ కొనసాగుతుంది. ఈ కథ మొదలైన దగ్గర నుంచి ఇక పుంజుకుంటుందేమో అనే ఒక ఆలోచనతో ఆడియన్స్ ఎదురు చూస్తుంటారు. అయితే కథలోగానీ .. కదలికలో గాని ఎలాంటి మార్పు ఉండదు. సాధారణంగా ఈ తరహా మలయాళ సినిమాలలో, చివరిలో ఏదో ట్విస్ట్ ఉంటుంది. అలాంటి ఒక ట్విస్ట్ ఏం ఉంటుందా? అని ఎదురుచూసిన ప్రేక్షకులకు నిరాశే మిగులుతుంది. చివర్లో ఏదో ఒక అద్భుతం జరగకపోగా, కథను అంతే బలహీనంగా వదిలేసి వెళ్లిపోతుంది. సాధారణంగా పెళ్లికి వచ్చిన పెద్దలు అక్షతలు వేసి ఆశీర్వదించి .. భోజనాలు చేసి వెళుతుంటారు. ఒకవేళ పెళ్లి ఆగిపోయినా యువతులు కుమిలిపోతూ కూర్చోవలసిన అవసరం లేదు. పెద్దలు డీలాపడిపోయి వెనుదిరగవలసిన అవసరం లేదు. సందడిని కొనసాగించి .. ఆ తరువాత ఆ యువతి తన భవిష్యత్తుపై ఫోకస్ చేయవచ్చు అనే ఒక చిన్నపాటి సందేశం ఈ కథలో కనిపిస్తుంది. కాకపోతే అది బలంగా నాటుకోవడానికి అవసరమైన సన్నివేశాలు పడలేదు. పల్లె వాతావరణం .. అక్కడ పెళ్లి జరిగే తంతు .. తాగుబోతుల హడావిడి .. ఒకే కలర్ శారీస్ కట్టుకోవాలనే మహిళల ఆలోచన .. మ్యూజికల్ నైట్స్ .. ఈ తరహా వాతావరణం సెట్ చేయడంలో కొంతవరకూ సక్సెస్ అయ్యారు.

కాకపోతే కథలో బలం లేని కారణంగా అవి కనెక్ట్ కాలేకపోయాయి. పాత్రల పరంగా చెప్పుకోవడానికిగానీ, నటన పరంగా చెప్పుకోవలసిన పరిస్థితిగాని మనకి ఎక్కడా కనిపించదు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం ..ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయంతే. కేవలం ఐశ్వర్య లక్ష్మి పాత్ర చుట్టూ మాత్రమే వేసుకున్న సింపుల్ లైన్ ఇది. ప్రేక్షకులను ఏ మాత్రం ప్రభావితం చేయలేని కంటెంట్ గానే ఇది కనిపిస్తుంది.

# 100 కోట్ల క్లబ్ దిశగా ‘ఇరుముడి’



రవితేజ అంటే చాలు మాస్ ఆడియన్స్ ఊగిపోతారు. ఆయన సినిమాలలో యాక్షన్ ఉంటుంది .. ఎమోషన్ ఉంటుంది .. తనదైన కామెడీ ఉంటుంది. రొమాంటిక్ గా సాగిపోయే సాంగ్స్ ఉంటాయి. ఫైనల్ గా వీటన్నిటికీ మాస్ టచ్ ఉంటుంది. అయితే ఈ సారి మాత్రం ఆయన కాస్త డిఫరెంట్ గా డివోషనల్ టచ్ ఇస్తూ, ‘ఇరుముడి’ సినిమా చేశారు. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 21వ తేదీన భారీ ఓపెనింగ్స్ తో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. తొలి రోజునే ప్రపంచవ్యాప్తంగా 24 కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. మొదటి రోజునే హిట్ టాక్ రావడంతో, శనివారం నుంచి థియేటర్స్ పెంచవలసిన వచ్చింది. దాంతో ఈ సినిమా మరింత దూకుడు చూపిస్తూ వెళ్లింది. అలా మొదటి మూడు రోజులలో ఈ సినిమా 75 కోట్లకు పైగా గ్రాస్ ను రాబట్టింది. రెండు రోజులలోనే బ్రేక్ ఈవెన్ ను సాధించింది, రవితేజ కెరియర్లో చాలా వేగంగా ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన సినిమాగా నిలిచింది. అలాగే రవితేజ కెరియర్లో యూ ఎస్ బాక్సాఫీస్ వైపు నుంచి, తొలి మిలియన్ డాలర్ మూవీగా నిలిచింది. ఇక సోమవారం రోజున కూడా ఈ సినిమా అదే జోరును కొనసాగిస్తుండటం విశేషం. 100 కోట్ల క్లబ్ లోకి ఈ సినిమా చేసే సమయం చాలా దగ్గరలోనే ఉంది. కూతురు పట్ల ఉన్న ప్రేమ .. ఆ కూతురును ఇచ్చిన అయ్యప్పస్వామి పట్ల భక్తి రవితేజ పాత్రలో ప్రధానమైన కోణాలుగా కనిపిస్తాయి. ఆడపిల్లలకు ఒక ఆశయం ఉండాలి .. వాళ్లు ధైర్యంగా పెరగాలి .. ఆదర్శంగా నిలవాలి అనే కాన్సెప్ట్ తో రూపొందిన ఈ సినిమాకి, పాటలు అదనపు బలంగా నిలిచాయి. విలేజ్ నేపథ్యంలోని హీరోయిజం .. విలేజ్ ను అడ్డాగా చేసుకుని దుర్మార్గాన్ని సాగించాలనుకున్న విలనిజం ఆవిష్కరణ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. రవితేజ కెరియర్ లో గొప్ప హిట్ గా ఈ సినిమా నిలుస్తుందని చెప్పచ్చు.

## మిస్ యూనివర్స్ వేదికను సుస్మితా సేన్‌తో పంచుకోవడంపై ఊర్వశి రౌతేలా ఎమోషనల్



నటి, మాజీ అందాల రాణి ఊర్వశి రౌతేలా మరోసారి వార్తల్లో నిలిచారు. మిస్ యూనివర్స్ ఇండియా పోటీలకు ఆమె వరుసగా నాలుగోసారి న్యాయనిర్ణేతగా వ్యవహరించి ప్రత్యేకతను చాటుకున్నారు. అయితే, ఈసారి ఈ కార్యక్రమం ఆమెకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం అయింది. తన కెరీర్ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన, తన గురువుగా భావించే సుస్మితా సేన్‌తో వేదిక పంచుకోవడంతో ఊర్వశి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా తన గురువు సుస్మితా సేన్‌తో ఉన్న అనుబంధాన్ని ఊర్వశి పంచుకున్నారు. “నా మొదటి మెంటర్, నా గురువు, మన దేశపు తొలి మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో ఈ క్షణాలను పంచుకోవడం అనంతమైన ఆనందాన్ని ఇస్తోంది. నాకు ఎగరడానికి రెక్కలిచ్చిన మహిళ ఆమె. సాధారణంగా ఆమె ఎవరికీ అలా చేయరు, కానీ నా పట్టాభిషేకం రోజున స్వయంగా ఆమే నాకు కిరీటాన్ని అలంకరించారు. అది నా జీవితంలో అత్యంత మధురమైన, మరచిపోలేని క్షణాల్లో ఒకటి” అంటూ ఊర్వశి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. సుస్మితా సేన్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని ఊర్వశి తెలిపారు. “ఆమె నాపై ఎందుకు అంత నమ్మకం ఉంచిందో ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది. కానీ కొన్ని ఆశీర్వాదాలకు వివరణలు ఉండవేమో, వాటిని ఆస్వాదించాలి అంతే. దేవుడికి, నా తల్లిదండ్రులకు, కుటుంబానికి, అభిమానులకు, ముఖ్యంగా నా గురువు సుస్మితకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. నా కృతజ్ఞతను మాటల్లో చెప్పలేను. కొన్ని కలలు నెరవేరతాయి, మరికొన్ని ఊహకు మించి ఉంటాయి. ఇది రెండో కోవకు చెందింది” అని ఆమె ఉద్వేగంగా మాట్లాడారు. ఇక ఈ కార్యక్రమంలో ఊర్వశి ధరించిన త్రివర్ణ పతాకం గౌను ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని గురించి ఆమె మాట్లాడుతూ, “వరుసగా నాలుగోసారి మిస్ యూనివర్స్ ఇండియాకు జడ్జిగా వ్యవహరించడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించినట్లు మా టీమ్ చెప్పింది.

# తాప్సీ, కంగనాల మాటల యుద్ధం



కంగనా రనౌత్‌కి కోపమొచ్చింది. నటి తాప్సీపై తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో అంతెత్తు లేచింది. నిజానికి వీరిద్దరి వైరం ఈనాటిది కాదు. ఏడేండ్ల క్రితం నాటిది. ‘జడ్జిమెంటల్ హై క్యా’ సినిమా టైమ్‌లో కంగనా సోదరి రంగోలీ.. తాప్సీని ఉద్దేశించి ‘చౌకబారు కాపీ’ అని సంబోధించడంతో ఈ గొడవకు బీజం పడింది. ఆ వెంటనే నెపోటిజం చర్చల సమయంలో తాప్సీ, స్వరా భాస్కర్‌లను కంగనా ‘బీ-గ్రేడ్ నటీమణులు’ అనడంతో ఈ వివాదం మరింత రాజుకున్నది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య అప్పట్లో మాటల యుద్ధమే జరిగింది. కొంతకాలానికి గొడవ సద్దుమణిగింది. ఇక ప్రశాంతంగా ఉంటున్నారులే అనుకునేలోపు మళ్లీ వారిద్దరి మధ్య తాజాగా మాటల యుద్ధం మొదలైంది. గత వివాదం, విభేదాల గురించి తాజా ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ ‘వివాదం జరిగిన నాటి నుంచి నేటి వరకూ కంగనాను నేను వ్యక్తిగతంగా కలవలేదు. సంస్కారాన్ని బట్టే మాట తీరు ఉంటుంది. పెంపకం సరిగ్గా లేనప్పుడు సంస్కారం రమ్మన్నా రాదు. ఆమె విధానం అది. ఎవరు ఎక్కడ్నుంచి వచ్చారో తెలుసుకోవడానికి ఇదే నిదర్శనం’ అంటూ వ్యాఖ్యానించింది. ఇక మీడియాలో ఈ ఇంటర్వ్యూ చూసి కోపంతో రగిలిపోయిన కంగనా.. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఈ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించింది. ‘తన బీ-గ్రేడ్ సినిమాల ప్రమోషన్ల కోసం చౌకబారు కాపీ మళ్లీ బయటకొచ్చింది. హెడ్ లైన్స్‌లో ఉండాలంటే నాలాంటి వాళ్ల పేరు వాడుకోవడం తప్ప తనకు వేరే దారి లేదు. ఈ రోజు నా తల్లిదండ్రుల పెంపకం గురించి మాట్లాడి లిమిట్స్ దాటింది. ఎంత గొడవైనా వారి తల్లిదండ్రుల గురించి మాత్రం నేను తప్పుగా మాట్లాడను. ఇలాంటి చౌకబారు కాపీని కన్నందుకు తన తల్లిదండ్రుల్ని చూస్తుంటే జాలేస్తున్నది. నిజమైన బిడ్డకు వారెందుకు జన్మనివ్వలేకపోయారో పాపం..’ అంటూ తాప్సీపై విరుచుకుపడింది కంగనా రనౌత్. ప్రస్తుతం వీరిద్దరి గొడవ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

## ది ప్యారడైజ్ ప్రమోషన్స్ టైం.. గెట్ రెడీ అంటోన్న నాని టీం..!




టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని అభిమానులతోపాటు మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ ది ప్యారడైజ్‌దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో మోహన్ బాబు, తనికెళ్లభరణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన నాని, మోహన్ బాబు పోస్టర్లు, గ్లింప్స్ తోపాటు టీజర్ సినిమాపై హైప్ పెంచేస్తున్నాయి. ది ప్యారడైజ్‌పై ఇప్పటికే రెండు రిలీజ్ డేట్స్‌లో మార్పులు చేశారని తెలిసిందే. ఫైనల్‌గా సెప్టెంబర్ 24న 2026 గ్రాండ్‌గా విడుదల కానుంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా విడుదలకు ఇంకో నెల మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో నాని టీం ఇక ప్రమోషనల్ ప్లాన్‌తో బిజీగా మారబోతుందన్న వార్త మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. కీర్తి సురేశ్‌పై వచ్చే స్పెషల్ సాంగ్ త్వరలో విడుదల చేయనున్నారు. ఈ సాంగ్ లాంచ్‌తో ప్రమోషనల్ ప్లాన్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. తెలుగుతోపాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానున్నఈ మూవీలో నాని నయా అవతార్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ తెప్పించడం ఖాయమని రషెష్ క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. మొత్తానికి త్వరలోనే నాని టీం ప్రమోషన్స్ షురూ కాబోతున్నాయన్న వార్త మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్‌కు గురి చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఈ జాగా మనదే.. అంటూ గూస్‌బంప్స్ తెప్పించే డైలాగ్‌తో షురూ అయిన ది ప్యారడైజ్ టీజర్లో మే ప్యారే ప్యారడైజ్ వాసియో అంటూ మోహన్ బాబు స్టైలిష్ ఎంట్రీ ఇవ్వగా.. సర్కార్ ఉన్నది ఈ దొరల కోసమా..? జనం కోసమా..? అంటూ సాగే సంభాషణలు.. మరోవైపు ఛీ అని ఛీదరించుకునే నలుపురంగే మన జెండా.. కాకే దాని మీద గుర్తు అంటూ..నాని ఓ జాతికి నాయకత్వం వహించే నాయకుడిగా అదిరిపోయే యాక్టింగ్‌తో బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొట్టడం ఖాయమని టీజర్ చెప్పకనే చెబుతోంది. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి కీ రోల్‌లో నటిస్తుండగా.. కిల్ ఫేం రాఘవ్ జుయల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్

## గ్లింప్స్ కూడా రాకముందే ‘మహాకాళి’కి బిగ్ డీల్..

### - నెట్‌ఫ్లిక్స్ చేతికి ఓటీటీ రైట్స్!



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ లేడీ సూపర్ హీరో మూవీ ‘మహాకాళి’పై అంచనాలు భారీగా ఉన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ డీల్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా ఫస్ట్ గ్లింప్స్ విడుదల కాకముందే ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ రైట్స్‌ను సొంతం చేసుకున్నట్లు సమాచారం. కొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ప్రమోషన్లు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే భారీ డీల్ కుదరడం ట్రేడ్ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ‘మహాకాళి’ ఫస్ట్ గ్లింప్స్‌ను ఆగస్టు 24 ఉదయం 11:34 గంటలకు విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేశారు. గ్లింప్స్‌పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొన్న సమయంలోనే సినిమా ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్నట్లు వార్తలు రావడం విశేషంగా మారింది. అయితే ఈ డీల్‌కు సంబంధించిన ఖచ్చితమైన మొత్తాన్ని చిత్రబృందం అధికారికంగా వెల్లడించలేదు. కానీ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు హక్కులను సొంతం చేసుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గ్లింప్స్ కూడా చూడకముందే ఓటీటీ సంస్థ ఇంతటి ఆసక్తి చూపడం సినిమాపై ఉన్న బజ్‌కు నిదర్శనంగా చెబుతున్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ‘హనుమాన్’ భారీ విజయాన్ని అందుకోవడంతో ఆయన సినిమాటిక్ యూనివర్స్‌పై దేశవ్యాప్తంగా ఆసక్తి పెరిగింది. భారతీయ పురాణాలు, మైథాలజీని సూపర్ హీరో కాన్సెప్ట్‌తో మిళితం చేస్తూ ప్రశాంత్ వర్మ సృష్టిస్తున్న ఈ యూనివర్స్‌లోని ప్రతి ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ నెలకొంది. ఇదే క్రమంలో ౹ాంఎజఖ నుంచి వస్తున్న తొలి లేడీ సూపర్ హీరో కథగా ‘మహాకాళి’ ప్రత్యేకతను సంతరించుకుంది. టైటిల్‌కు తగ్గట్టుగానే శక్తివంతమైన కథ, భారీ యాక్షన్, విజువల్ ఎఫెక్ట్స్‌తో సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో టైటిల్ పాత్ర ‘మహాకాళి’ గా భూమి శెట్టి కనిపించనున్నారు. ఈ సినిమాతో పూజా అపర్ణ కొల్లూరు దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై రివాజ్ రమేష్ దుగ్గల్ భారీ బడ్జెట్‌తో సినిమాను నిర్మిస్తున్నారు. మరోవైపు బాలీవుడ్ విలక్షణ నటుడు అక్షయ్ ఖన్నా ఈ సినిమాలో అత్యంత కీలకమైన నెగిటివ్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన పోషిస్తున్న ‘శుక్రాచార్య’ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. అక్షయ్ ఖన్నా లుక్, క్యారెక్టర్ ఎలా ఉండబోతున్నాయనే దానిపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ‘మహాకాళి’తో బాలీవుడ్ నటుడు రోహిత్ సరాఫ్ తెలుగు సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. ఆయనతో పాటు ఖుష్బూ సుందర్, శ్రియ రెడ్డి, సముద్రఖని, రాజేష్ బేడి, రజత్ కపూర్, నాజర్, మురళీ శర్మ, పృథ్వీరాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ఈసారి నెక్స్ట్ లెవల్లో..



జాంబీరెడ్డి, హను-మాన్, మిరాయి వంటి సూపర్ నేచురల్ థ్రిల్లర్స్‌లో నటించి సూపర్‌హీరో ఇమేజ్‌ని సొంతం చేసుకున్నారు హీరో తేజా సజ్జా. త్వరలో ఆయన మరో సూపర్ నేచురల్ థ్రిల్లర్‌తో రాబోతున్నారు. ఆ సినిమానే ‘జాంబీరెడ్డి 2 నెక్ట్స్ లెవెల్’. ఆదివారం తేజా సజ్జా పుట్టినరోజు సందర్భంగా ‘జాంబీరెడ్డి’ ఫ్రాంచైజీలో రెండో భాగాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ‘జాంబీరెడ్డి’తో జాంబీ ప్రపంచాన్ని తెలుగు తెరకు పరిచయం చేసిన దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్‌కు క్రియేటర్‌గా వ్యవహరిస్తుండగా, సుపర్ణ్ ఎస్.వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, నేపాలీ, జపనీస్ భాషల్లో విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం టైటిల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఫ్లైఓవర్ పైనుంచి ఓ జాంబీ ట్రక్కుపై పడటం.. ‘జాంబీస్ ఆర్ బ్యాక్’ అనే క్యాప్షన్‌తో గ్లింప్స్ మొదలైంది. గ్లింప్స్ ఆద్యంతం జాబీలతో పోరాడుతూ తేజా సజ్జా కనిపించారు. ఈ సారి కథ, యాక్షన్, స్కేల్ మరింత ఇంటెన్స్‌గా ఉండబోతున్నట్టు గ్లింప్స్ చెబుతున్నది. కన్నడ అగ్ర నటుడు ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో షానాయ కపూర్ కథానాయిక.

# మెదక్ జిల్లాలోని వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి చర్యలకు కృషి

**మంత్రి దామోదర రాజనర్సింహ**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని నూతన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌తో కలిసి మంత్రి ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం బ్లాక్‌ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.క్రిటికల్ కేర్ బ్లాక్‌కు అవసరమైన మానవ వనరులు, పరికరాలు, మౌలిక వసతులు, IHFMS సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై ఆగస్టు 25న హైదరాబాద్ సచివాలయంలో జరిగే ఉన్నతస్థాయి సమావేశానికి హాజరుకావాలని సూచించారు. GGHలో వైద్య సేవల బలోపేతం, నూతన భవన నిర్మాణం, మెడికల్ కళాశాల విద్యార్థుల హాస్టల్, తూప్రాన్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుపై చర్చించారు. నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్‌లలో డయాలసిస్ సేవలను సమీక్షించి, జిల్లాలో వైద్య సేవల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మ్యడం బాలకృష్ణ, డాక్టర్ శివ దయల్ అయ్యప్ప ఎంటర్ప్రైజెస్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా

**పకడ్బందీగా దర్యాప్తు. నిందితుడికి శిక్ష**

**మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి శ్రీనివాస రావు**




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, తెలిపారు. పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందిన లక్ష్మణ్ సుమారు 14 నెలల క్రితం గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరిని వివాహం చేసుకుని ఇల్లరికం వచ్చాడు. వీరికి అభిలాష్, కార్తీక్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన లక్ష్మణ్ తరచూ భార్య, కుటుంబ సభ్యులను వేధించడంతో 2023లో అతడిని ఇంటి నుంచి బయటకు పంపించారు.ఈ క్రమంలో 30.09.2025న లక్ష్మణ్ గడిపెద్దాపూర్‌కు వచ్చినట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. అదే రోజు రాత్రి పుట్టి ఆంజనేయులుతో కలిసి మద్యం సేవించాడు. అనంతరం మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో ఆంజనేయులు లక్ష్మణ్‌పై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని బయట పడేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు అల్లాదుర్గ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శంకర్ 01.10.2025 న కేసు నమోదు చేశారు. అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి సమగ్ర దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు పుట్టి ఆంజనేయులుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ అర్షద్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు

# అవసరాల మేరకే యూరియా కొనుగోలు చేయాలి

**కుల్చారం మండలం వ్యవసాయ అధికారి శ్వేతకుమారి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రైతులు సంయమనం పాటించి అవసరాల మేరకే యూరియాను కొనుగోలు చేయాలని ఏఓ ఎం. శ్వేతా కుమారి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ నుంచి ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ ఎరువుల బుకింగ్ యాప్‌ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.కొత్తగా వచ్చిన ఈ యాప్ ప్రారంభ దశలో ఉన్నందువల్ల కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయని, ప్రస్తుతం వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు తమకు అవసరమైన మేరకే యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు.రైతులు అవసరాలకు మించి ఎక్కువగా ఎరువులను కొనుగోలు చేయడం వల్ల కొంతమంది రైతులకు ఎరువుల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు రబీ సీజన్ కోసం ముందుగానే యూరియాను నిల్వ చేసుకోకుండా ప్రస్తుత పంట అవసరాల మేరకే కొనుగోలు చేయాలని సూచించారు.కుల్చారం మండలంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎరువులసరఫరానునిరంతరంపర్యవేక్షిస్తున్నామని ఏఓ ఎం. శ్వేతా కుమారి పేర్కొన్నారు.

# బోర్డు అభివృద్ధే లక్ష్యంగా పనులు

**- ఎమ్మెల్యే శ్రీ గణేష్**

**- నవ కంటోన్మెంట్ నిర్మాణంలో క్లీన్ కంటోన్మెంట్ మిషన్ చేపట్టాలని బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచన**

**- ప్రజలు మౌలిక సమస్యలతో సతమతమవుతున్న విషాన్ని అధ్యక్షుడికి వివరిస్తున్న ఎమ్మెల్యే**





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశంలో కంటోన్మెంట్ అధ్యక్షుడు, బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని అన్ని వార్డుల్లో చెత్త, మురుగు నీరు రోడ్లపై ఏరులై పారుతున్న పట్టించుకునే నాథుడే లేడు,అదిగాక బోర్డు పరిధిలో ఉన్న అంతర్గత రోడ్లు,ప్రధాన రహదారులు సైతం గుంతలతో స్వాగతం పలుకుతూ, వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు.మౌలిక సమస్యలు తలెత్తడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని, వెంటనే క్లీన్ కంటోన్మెంట్ మిషన్ చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ బ్రిగేడియర్ కు వివరించారు.యుపిహెచ్సీ ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 6 కోట్లు మంజూరు చేసిందని,మిగిలిన ఎన్ఓసి లు త్వరగా ఇవ్వాలని ఆయన కోరారు.అలాగే ఎలివేటెడ్ కారిడార్లతో సమకూరిన రూ.303 కోట్లు,మరో రూ.35 కోట్లతో నాలాలు, డ్రైనేజీల అభివృద్ధి చేయిలని పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.బ్రిగేడియర్,సిఇఓ, నామినేటెడ్ మెంబర్ లు ఎమ్మెల్యే సూచనతో ఏకీభవించారు.

సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం అందరూ కలిసి రావాలని, అప్పుడే స్థానిక సమస్యలు పరిష్కారం అవుతాయని, అలాగే బోర్డు అధికారులు నిర్లక్ష్యం వల్ల పలు ప్రాంతాల్లో మౌలిక సమస్యలు తాండవం ఆడుతున్నాయని ఉన్నతాధికారులకు విషయాన్ని వెల్లడించారు.

**కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా:**

**- కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధి పనులకు టెండర్ల ఆమోదం. త్వరలో పలు వార్డుల్లో పనులు ప్రారంభం**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చించి,వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లను ఆమోదించడం జరిగిందని విలేకరుల సమావేశంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా పేర్కొన్నారు.గత కొన్ని రోజులుగా గుత్తేదారులు (కాంట్రాక్టర్లు) టెండర్లు దాఖలు చేయకపోవడం వల్ల అభివృద్ధి పనుల్లో కొంత జాప్యం జరగడం వాస్తవమేనని ఆమె తెలిపారు.ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ పూర్తయినందున, మొత్తం రూ.9 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్,అలాగే త్వరలో ప్రారంభం కానున్నాయని అన్నారు.కాలనీ,బస్తీ అంతర్గత రోడ్ల కోసం (సిమెంట్ రోడ్ల నిర్మాణం) రూ.3 కోట్లు వెచ్చించు చున్నారు.అదిగాక పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పొంగి ప్రవహిస్తున్నాయి.వాటి నిర్మాణం కోసం రూ.3 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.పార్కుల అభివృద్ధి,ట్రాఫిక్ జంక్షన్లు, ఫుట్‌పాత్‌లు,డివైడర్లు ఇతరత్రా పనులు కోసం మరో రూ.3 కోట్లు మంజూరు.ఈ పనులను వచ్చే పక్షం రోజుల్లో కంటోన్మెంట్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నాము.అదే విధంగా,గతంలో కంటోన్మెంట్ భూములను ఎలివేటెడ్ కారిడార్ కోసం బదలాయించినందుకు లభించిన రూ.303 కోట్ల పరిహారానికి అదనంగా మరో రూ.35 కోట్లు అందనున్నాయి.ఈ నిధులను వినియోగించడంతో పాటు హెచ్ఎండిఏ సహకారంతో త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.అదే విధంగా, కంటోన్మెంట్ బోర్డుకు మరో రూ.20 కోట్ల నిధులు రానున్నాయి.ఈ నిధులను ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు సమర్థవంతంగా వినియోగించేలా కృషి చేస్తామని భానుక నర్మాద తెలిపారు.బోర్డు పరిధిలో అసంతృప్తి గా మిగిలిన కమ్యూనిటీ హాళ్ల పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.కంటోన్మెంట్ పరిధిలోని కమ్యూనిటీ హాళ్ల విషయమై స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ కి ముఖ్యమైన విజ్ఞప్తి అంటూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు రాక గతంలో సుమారు 15 నుంచి 20 వరకు సామాజిక భవనాలు (కమ్యూనిటీ హాళ్లు) సగం సగం నిర్మాణ దశలో నిలిచిపోయాయి.వాటికి అవసరమైన నిధులు కేటాయించి,పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తి చేయడానికి ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. ఈ కమ్యూనిటీ హాళ్లు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తే కంటోన్మెంట్ పరిధిలోని అనేక బస్తీలు, కాలనీల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.అనంతరం అవసరమున్న ప్రాంతాల్లో కొత్త కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కూడా చర్యలు చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు.కంటోన్మెంట్ ప్రజల మౌలిక వసతులు, అభివృద్ధి,సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తాము. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే మా ప్రధాన లక్ష్యమని నర్మదా పేర్కొన్నారు.

# మధుమేహ సంబంధిత కంటి వ్యాధుల గుర్తింపుపై ఏఐ పరిశోధనకు పీహెచ్.డీ



పటాన్‌చెరు( ప్రశ్న న్యూస్)హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లోని, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని జి.కార్తీక డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'డయాబెటిక్ రెటినోపతి, మధుమేహ సంబంధిత కంటి వ్యాధుల స్వయంచాలక గుర్తింపు, వర్గీకరణ కోసం డీప్ లెర్నింగ్, ట్రాన్స్ ఫార్మర్-ఆధారిత ఫ్రేమ్ వర్కుల'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. విజయకుమార్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ సిద్ధాంత వ్యాసం, ఫండస్ చిత్రాల నుంచి రెటీనా వ్యాధులను కచ్చితంగా, సమర్థవంతంగా నిర్ధారించడానికి, డీప్ లెర్నింగ్, విజన్ ట్రాన్స్ ఫార్మర్స్, జెనరేటివ్ అడ్వర్సేరియల్ నెట్ వర్కులను ఉపయోగించి అధునాతన కృత్రిమ మేధస్సు నమూనాలను అభివృద్ధి చేసినట్టు తెలియజేశారు.ఈ పరిశోధన, కృత్రిమ రెటీనా డేటాసెట్లను రూపొందించడానికి, వ్యాధి నిర్ధారణ కచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి, వ్యాధి తీవ్రతను వర్గీకరించడానికి వినూత్నమైన ఏఐ-ఆధారిత ఫ్రేమ్ వర్కులను పరిచయం చేసినట్టు వివరించారు. ప్రతిపాదిత ఈ వ్యవస్థ, ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో, నేత్ర వైద్యులకు ముందస్తు రోగ నిర్ధారణలో సహాయపడటానికి, రోగ నిర్ధారణ పనిభారాన్ని తగ్గించడానికి, పెద్దయెత్తున మధుమేహ నేత్ర పరీక్షలను సులభతరం చేయడానికి దోహదపడే సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు.డాక్టర్ కార్తీక సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఇళ్ల మధ్యలో వర్షపు నీరు.. చెరువును తలపిస్తున్న దృశ్యం

**- 3వ వార్డులో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు?**

**- వర్షాలు మరింత కురిస్తే పరిస్థితి మరింత దారుణం.. వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సత్య ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ఇళ్ల మధ్యలో వర్షపు నీరు భారీగా నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇళ్ల మధ్యలోనే నీరు నిలిచిపోవడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఈ నీటిలోంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్నారులు, వృద్ధులు జారిపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షాలు పెరిగితే.. మరింత ముప్పు!**

ప్రస్తుతం వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో మరోసారి భారీ వర్షం కురిస్తే నిలిచిన నీరు ఇళ్లలోకి చేరే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో దోమలు, దుర్వాసనతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు.

**మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించాలి**

సమస్యను అధికారులు తక్షణమే పరిశీలించి నిలిచిన వర్షపు నీటిని తొలగించడంతో పాటు, నీరు నిలవకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు మహమ్మద్ గౌసొద్దీన్, ఇక్బాల్, నరసింహారెడ్డి, జనార్ధన్ రెడ్డి, దమ్మని మల్లేశం, సతీష్ కుమార్ తదితరులు మున్సిపల్ అధికారులను విజ్ఞప్తి చేశారు.

# సారంపల్లి మల్లారెడ్డికి విప్లవ జోహార్లు

**రైతాంగ, ప్రజా ఉద్యమాలకు ఆయన సేవలు చిరస్మరణీయ**

**సీపీఎం గజ్వేల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఘన నివాళులు**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సీపీఎం సీనియర్ నాయకులు, రైతాంగ ఉద్యమ నేత సారంపల్లి మల్లారెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. సోమవారం గజ్వేల్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సారంపల్లి మల్లారెడ్డికి విప్లవ జోహార్లు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో సారంపల్లి మల్లారెడ్డి కీలక పాత్ర పోషించిన నిబద్ధత కలిగిన నాయకుడని అన్నారు. పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, వారి హక్కుల సాధన కోసం జీవితాంతం కృషి చేశారని తెలిపారు.రైతాంగ సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి రైతులను సంఘటితం చేశారని, భూమి, సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర, రైతుల హక్కులు తదితర సమస్యలపై జరిగిన అనేక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి, ప్రజల మధ్య ఉంటూ నిరంతరం పోరాడిన నాయకుడిగా మల్లారెడ్డి చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు.సారంపల్లి మల్లారెడ్డి మృతి సీపీఎం పార్టీకి, రైతు సంఘానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనను కోల్పోవడం ద్వారా నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడిని, ప్రజల కోసం నిరంతరం పోరాడిన ఉద్యమకారుడిని కోల్పోయామని అన్నారు.మల్లారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఎల్లయ్య పేర్కొన్నారు. రైతులు, కార్మికులు, పేదలు, సామాన్య ప్రజల సమస్యలపై మరింత ఐక్యంగా పోరాటాలు నిర్వహిస్తూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సందటి రంగారెడ్డి, పార్టీ మండల నాయకులు బండ్ల స్వామి, కోనేరు ప్రవీణ్, శివయ్య ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మేతరి నారాయణ కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి



ధర్పల్లి(ప్రశ్న న్యూస్)ధర్పల్లి మండలంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మేతరి నారాయణ కుటుంబ సభ్యులను నిజామాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని భార్య దుఃఖంతో మాట్లాడుతూ ముగ్గురు ఆడపిల్లల తండ్రి అయిన తన భర్త,ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్ల కోసం కొంత భూమి కొన్నారని, అది మోసానికి గురైనట్లు తెలిసి రెండేళ్లుగా మనోవేదనకు గురై,తట్టుకోలేక గుండెపోటుతో మరణించారని కన్నీరుమున్నీరయ్యారు.బాధిత కుటుంబాన్ని ఓదార్చిన దినేష్ కులాచారి,పార్టీ తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, కరక గంగారెడ్డి, కోమటి దాసు, సరిచంద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాదులో
# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

-అనుమతులకు మించిన అక్రమ అంతస్తులను కూల్చివేస్తాం

-మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘిస్తే కూల్చివేతలే

- ఎక్కడ అక్రమ నిర్మాణాలు చేసిన అధికారుల కఠిన చర్యలు

-అక్రమ నిర్మాణాలకు అండగా ఉంటున్నదే చైన్ మెన్, సెక్షన్ ఆఫీసర్, ఏసిపి, డిప్యూటీ కమిషనర్లు

-75గజాల్లో 7మీటర్లకు మించి నిర్మాణాలను కూల్చి వేస్తాం





హైదరాబాద్( ప్రశ్న న్యూస్ ) గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా చిన్న విస్తీర్ణంలో భారీగా అంతస్తులు, అనుమతులకు మించి అక్రమ అంతస్తుల భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించే వారికి ఇకపై ఉపశమనం ఉండదనే సంకేతాలు వెలువడుతున్నాయి. 75 గజాల స్థలంలో 7 మీటర్లకు మించి నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేసే చర్యలు చేపడతామని అధికారులు స్పష్టం చేసినట్లు అందిన సమాచారం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

### నగరవ్యాప్తంగా అక్రమ నిర్మాణాలు గుర్తింపు

జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో 50 గజాల స్థలాల్లోనే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. చాలా నిర్మాణాలకు సరైన అనుమతులు లేకుండా అంతస్తులు 7 వరకు పెంచడం, నిర్మాణానికి అనుమతించిన పరిమితులను దాటి భవనాలను విస్తరించడం వంటి చర్యలపై అధికారులు దృష్టి సారించారు.

### 75 గజాల నిబంధనలపై ప్రత్యేక దృష్టి

75 గజాల స్థలంలో 7 మీటర్లకు మించి నిర్మాణాలు చేపడితే వాటిపై చర్యలు తప్పవని అధికారులు పేర్కొన్నట్లు అధికారం పేర్కొన్నారు. చిన్న స్థలాల్లో భారీ నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్‌లో పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, బిల్డర్లు నాసిరకం సామాగ్రిని వాడి నిర్మాణాల నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని అధికారులు భావిస్తున్నారు.

### నిబంధనలు పాటించాల్సిందే..

భవన నిర్మాణానికి ముందు సంబంధిత అనుమతులు తీసుకోవడం, అనుమతించిన ప్లాన్ ప్రకారమే నిర్మాణం చేపట్టడం తప్పనిసరి. అనుమతులు తీసుకున్న తర్వాత వాటికి విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం లేదా నిర్మాణ విస్తీర్ణాన్ని పెంచడం వంటి చర్యలను అధికారులు తీవ్రంగా పరిగణిస్తామని తెలపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

### అక్రమ నిర్మాణాలపై వరుస తనిఖీలు

నగరంలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై తనిఖీలు కొనసాగుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న చాలా భవనాలు, అనుమతులకు మించి చేపడుతున్న నిర్మాణాలు, నిబంధనలను ఉల్లంఘిస్తున్న భవనాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకునే దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

### డబ్బులు తీసుకుని నిర్మిస్తే సహించం

అక్రమ నిర్మాణాలకు సహకరించే వారిపై కూడా అధికారులు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి తర్వాత వాటిని క్రమబద్ధీకరించుకోవచ్చనే ధోరణికి అడ్డుకట్ట వేయాలని అధికారులు భావిస్తున్నారు. మున్సిపల్ శాఖలో టౌన్ ప్లానింగ్ అధికారులే పూర్తిగా అక్రమాల నిర్మాణాలకు సహకరిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. నిర్మాణదారులు, యజమానులు నిబంధనలు తెలుసుకుని వాటికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచిస్తున్నారు.

### అధికారుల హెచ్చరిక

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించే ప్రసక్తే లేదు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే వాటిపై చర్యలు తప్పవు" అనే విధంగా ఉన్నత అధికారులు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. గతంలో ఇలాంటి హెచ్చరికలు చాలా చేసిన వాటిని కింది స్థాయి అధికారులు సిబ్బంది అసలు పట్టించుకోలేదు. అక్రమ నిర్మాణాలపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.

### ప్రజలకు ముఖ్య సూచన

భవన నిర్మాణం చేపట్టే ముందు స్థల విస్తీర్ణం, అనుమతించబడిన నిర్మాణ పరిమితి, అంతస్తుల సంఖ్య, భవన ఎత్తు తదితర అంశాలను సంబంధిత అధికారుల నుంచి స్పష్టంగా తెలుసుకోవాలి. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే తర్వాత కూల్చివేతలతో పాటు ఆర్థిక నష్టాన్ని కూడా ఎదుర్కోవాల్సి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కానీ టౌన్ ప్లానింగ్ అధికారులే మామూళ్ల మత్తులో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనే విషయం ఉన్నత అధికారులు మర్చిపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఖాళీ వెంచర్‌కు మిషన్ భగీరథ పైపులైన్లు.?

- జనావాసాలు లేని ప్రైవేట్ వెంచర్‌లో భారీగా పనులు
- ప్రజా అవసరాలను పక్కనబెట్టి ప్రైవేట్ వెంచర్‌కు ప్రాధాన్యతలో అంతర్యం ఏమిటి.?
- అనుమతులు, నిధుల మంజూరుపై స్థానికుల ప్రశ్నలు
- అధికారుల అవినీతి పై పూర్తి విచారణ చేయించాలన్న స్థానికుల డిమాండ్



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్య ప్రజలు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు వంటి కనీస మౌలిక వసతుల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నిబంధనల పేరుతో తిప్పిపంపుతున్న అధికారులు.. ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వెంచర్ల విషయంలో మాత్రం ఉదారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఉన్న 'చంద్రవిహార్' ప్రైవేట్ వెంచర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు చేపట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం వెంచర్‌లో ఒక్క ఇల్లు కూడా లేకపోయినా పెద్దఎత్తున పైప్‌లైన్ పనులు చేపట్టడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### జనావాసాలు లేని చోట ఎందుకీ అత్యవసరం.?

జనావాసాలు లేని ప్రైవేట్ వెంచర్‌కు ఇంత ప్రాధాన్యతనిస్తూ పైప్‌లైన్ పనులు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో ప్రజలు తాగునీటి



కోసం ఇబ్బందులు పడుతున్నా ఆయా సమస్యలను పట్టించుకోకుండా, ప్రైవేట్ వెంచర్‌లో మాత్రం మౌలిక వసతుల పనులు చేపట్టడం వెనుక కారణమేంటని నిలదీస్తున్నారు.

### ప్రజాధనంతో ప్రైవేట్ వెంచర్ అభివృద్ధి.?

### అధికారుల హస్తం ఎంత.?

ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఈ పనుల వల్ల మున్సిపాలిటీకి, ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అవసరాల కోసం వినియోగించాల్సిన నిధులను ప్రైవేట్ వెంచర్ అభివృద్ధికి మళ్లిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పైప్‌లైన్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయడం వల్ల వెంచర్ విలువ పెరిగి, భవిష్యత్‌లో ప్లాట్ల ధరలు పెరిగే అవకాశం ఉంటుందని స్థానికులు విమర్శిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### అనుమతులు ఉన్నాయా.? నిధులు ఎక్కడివి.?

చంద్రవిహార్ వెంచర్‌కు పైప్‌లైన్ ఏర్పాటుకు అనుమతులు ఎలా వచ్చాయి? నిధులు ఏ పథకం కింద మంజూరయ్యాయి? పనులకు పరిపాలనా, సాంకేతిక అనుమతులు ఉన్నాయా? టెండర్ ప్రక్రియ ఎలా జరిగింది.? పనుల అంచనా వ్యయం ఎంత.? వంటి అంశాలను అధికారులు బహిర్గతం చేయాలని 5వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

ప్రజాధనం దుర్వినియోగమైందనే ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకుంటే పనులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టిసారించి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# ఉద్యోగాలు భర్తీ చేయకుండా
# రిజర్వేషన్లకు ఎసరు

- రిజర్వేషన్లను కేంద్రం పరోక్షంగా నిర్వీర్యం చేస్తోందన్న ఖర్గే



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా, లక్షలాది పోస్టులను ఖాళీగా ఉంచడం ద్వారా రిజర్వేషన్లను పరోక్షంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం లేకుండానే రిజర్వేషన్లను అంతం చేసేందుకు ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకుందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఖర్గే కొన్ని కీలక గణాంకాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2015లో కేంద్ర ప్రభుత్వంలో 4.21 లక్షల పోస్టులు ఖాళీగా ఉండగా, 2024 నాటికి ఆ సంఖ్య 8.24 లక్షలకు చేరింది. ప్రస్తుతం రైల్వే శాఖలో 2.40 లక్షలు, రక్షణ శాఖలో 2.41 లక్షలు, హోం మంత్రిత్వ శాఖలో 1.10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, శాశ్వత ఉద్యోగాలను కాంట్రాక్టు ఉద్యోగాలుగా మార్చడం ద్వారా రిజర్వేషన్ ఫలాలను దెబ్బతీస్తున్నారని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలలో 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను తొలగించారని, అదే సమయంలో కాంట్రాక్టు కార్మికుల వాటా 19 శాతం నుంచి 49 శాతానికి పెరిగిందని వివరించారు. "రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేదు రిజర్వేషన్లు ఉన్న ఉద్యోగాలను తొలగిస్తే చాలు" అంటూ ఆయన తన పోస్టులో ప్రభుత్వాన్ని ఎండగట్టారు.

# రాజకీయ సన్యాసం ప్రసక్తే లేదు

- బీజేపీని కనుమరుగు చేసే వరకు విశ్రమించనని శపథం



కోల్కతా (ప్రశ్న న్యూస్) తాను రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బీజేపీని అధికార పీఠం నుంచి దించే వరకు తన పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. సోమవారం ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన నాలుగు నెలల్లోనే బీజేపీ అసలు స్వరూపం ప్రజలకు అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఎన్ఆర్సీ అమలు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జనగణనను ఒక సాకుగా వాడుకుంటోందని ఆరోపించారు. జనగణన దరఖాస్తులపై సంతకాలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'అన్నపూర్ణ భండార్' పథకం కింద ఆర్థిక సాయం అందడంలో జాప్యం జరుగుతోందని, అనర్హత సాకుతో లబ్ధిదారుల సంఖ్యను కుదించడం ఎన్నికల వాగ్దానాలను ఉల్లంఘించడమేనని ఆమె విమర్శించారు. ఇటీవల జాదవ్‌పుర్ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ, వామపక్ష విద్యార్థి సంఘాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల వెనుక బీజేపీ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. క్యాంపస్‌లలో హింసను ప్రేరేపిస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని, వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

# నాపై నిఘా పెట్టారు

- సీఎం సోదరుడిపై ఎంపీ అర్వింద్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం తెలంగాణ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగంపై సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు, ఒక ఏసీపీ స్థాయి అధికారి తన కదలికలపై నిఘా ఉంచినట్లు ఆయన ఆరోపించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి ఆయన ఒక పోస్ట్ చేశారు. "డీజీపీ సీవీ ఆనంద్ గారూ, మీరు నాకు దశాబ్దాలుగా తెలుసు. మిమ్మల్ని ఎప్పుడూ ఒక సమర్థవంతమైన అధికారిగానే పరిగణించాను. అయితే, ముఖ్యమంత్రి సోదరుడి ఆదేశాల మేరకు ఒక ఏసీపీ స్థాయి అధికారికి నా కదలికలను పర్యవేక్షించే బాధ్యతను అప్పగించినట్లు నా దృష్టికి వచ్చింది" అని అర్వింద్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల పనితీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "తెలంగాణ పోలీసులు రాజ్యాంగానికి, చట్టబద్ధమైన అధికార యంత్రాంగానికి లోబడి పనిచేస్తారా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు నడుచుకుంటారా? అనేది ఇక్కడ ఉత్పన్నమవుతున్న ప్రాథమిక ప్రశ్న" అని ఆయన నిలదీశారు. పోలీసులు కేవలం చట్టానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని, ఏ రాజకీయ కుటుంబానికీ కాదని తాను ఆశిస్తున్నట్లు అర్వింద్ స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588